

బిల్లుల చెల్లింపుల్లో 'నీరు'గార్చుతున్నారు!

- నీరు-చెట్టు పనులకు రూ.15 కోట్ల బడ్జెట్ విడుదల
- మూడు నెలల క్రితమే ఇచ్చిన ప్రభుత్వం
- కానీ బిల్లుల అప్‌లోడ్‌లో అధికారుల నిర్లక్ష్యం
- అసలు నిధులు ఇచ్చిన విషయమే తెలియని వైనం
- ఇప్పుడు సీఎఫ్ఎంఎస్ ఫేస్-2తో అప్‌లోడ్‌కు ఇబ్బందులు
- ఆర్థికంగా కుంగిపోతున్న కాంట్రాక్టర్లు

దేవుడు వరమిచ్చినా పూజారి కరునించలేదన్న సామెతలా మారింది నీరు-చెట్టు పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి. గత ప్రభుత్వంలో చేసిన పనులకు కొన్నేళ్లపాటు కోర్టుల్లో పోరాడి బడ్జెట్ తెచ్చుకున్నామన్న సంతోషం ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆవిరవుతోంది. బడ్జెట్ రాకపోవడంతోనే బిల్లులు అప్‌లోడ్ చేయలేకపోతున్నామని చెప్పే అధికారులు, నీరు-చెట్టు పనుల విషయంలో బడ్జెట్ ఇచ్చినా బిల్లులు అప్‌లోడ్ చేయడం లేదు. కనీసం బడ్జెట్ విడుదలైనట్లు కూడా అధికారులకు తెలియదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపు మూలంగా ఇప్పటికే చితికిపోయిన కాంట్రాక్టర్లు ఇప్పుడు ఇరిగేషన్ అధికారుల తీరుతో మరింత కుంగిపోతున్నారు. ఎప్పుడో అక్టోబరులో బడ్జెట్ వస్తే ఇంతవరకు బిల్లులు అప్‌లోడ్ చేయకపోవడం వారిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

నెల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ప్రభుత్వంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నీరు - చెట్టు కింద 13,780 పనులు మంజూరవగా రూ.711 కోట్లతో పది వేల వరకు పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి జిల్లాలో సుమారు రూ.200 కోట్ల వరకు నీరు - చెట్టు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పనులు కావడంతో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ బిల్లులన్నీ పక్కన పెట్టేసింది. చిన్న చిన్న కాంట్రాక్టర్లు ఎన్ని విన్నపాలు చేసుకున్నా, నిరసనలు తెలియజేసినా పట్టించుకోలేదు. పైగా ఈ పనులపై మొదట విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ తర్వాత కూడా బిల్లుల చెల్లింపు జరగలేదు. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు ఒక్కొక్కరుగా హైకోర్టును ఆశ్రయిస్తూ వస్తున్నారు. బిల్లులు చెల్లించాలంటూ అత్యున్నత ధర్మాసనం ఆదేశాలిస్తోంది. ఈ నేపథ్యంలో మరోసారి ఇరిగేషన్ శాఖ అధికారుల చేతనే నీరు-చెట్టు పనులను పరిశీలించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇలా పరిశీలన జరిగాక కూడా బిల్లులు ఇవ్వలేదు. మరోవైపు కోర్టు ధిక్కరణ కేసులు ఎక్కువైపోతుండటంతో ఈదఫా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ వంటి ఇతర శాఖల ఇంజనీర్లతో థర్డ్‌పార్టీ కింద విచారణ జరిపింది. ఈ అన్ని విచారణల్లో నీరు-చెట్టు పనుల్లో అవినీతి జరిగినట్లు రుజువు కాలేదు. దీంతో కోర్టుకెళ్లిన కాంట్రాక్టర్లకు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో బిల్లులు చెల్లిస్తూ వస్తోంది.

● కొత్త విధానంతో ఆలస్యం

హైకోర్టులో రిట్ పిటిషన్ల ఒత్తిడి తట్టుకోలేక పెండింగ్ ఉన్న నీరు-చెట్టు బిల్లులు చెల్లించేందుకు జిల్లాకు రూ.15 కోట్లు బడ్జెట్ విడుదల చేశారు. గతేడాది అక్టోబరులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల హెడ్‌లకు ఈ బడ్జెట్ విడుదలైంది. అయితే, బడ్జెట్ ఇచ్చినా బిల్లులు రాకపోవడంపై రాష్ట్ర ఉన్నతాధికారులు సమీక్షించిన తర్వాత గానీ జిల్లాలోని ఇంజనీర్లకు విషయం తెలియలేదని ఇరిగేషన్‌శాఖలో చెప్పుకుంటున్నారు. ఆ తర్వాత హడావిడిగా బిల్లులు అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. గత డిసెంబర్ 15వ తేదీ తర్వాత నుంచి సీఎఫ్ఎంఎస్ ఫేజ్-2 విధానం అమల్లోకి వచ్చింది. అంటే అంతకముందు వరకు బిల్లుల అప్‌లోడ్‌కు వర్కు ఆబ్‌స్ట్రాక్ సరిపోయేది. దీంతో సులభంగా బిల్లును అప్‌లోడ్ చేసేవారు. కానీ సీఎఫ్ఎంఎస్ ఫేజ్-2 విధానంలో బిల్లుల అప్‌లోడ్‌కు చాలా నిబంధనలు చేర్చారు. వర్కు ఆబ్ స్ట్రాక్ మాత్రమే కాకుండా ఎంబుక్‌లను కూడా డిజిటలైజ్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. సంబంధిత వర్కు చేయించిన జేఈ, డీఈఈ, ఈఈల లాగిన్ల ద్వారా బిల్లును అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఇలా ప్రతి డాక్యుమెంట్‌నూ డిజిటలైజ్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో తప్పులు లేకుండా చూసుకునేందుకు చాలా సమయం పడుతోంది. దీంతో బిల్లుల అప్‌లోడ్ ఆలస్యమవుతున్నట్లు ఇంజనీర్లు చెబుతున్నారు. బడ్జెట్ విడుదలైన వెంటనే అధికారులు మేల్కొని ఉంటే సీఎఫ్ఎంఎస్ ఫేజ్-1లోనే బిల్లులు అప్‌లోడ్ జరిగిపోయి ఉండేవని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. జిల్లాకు వచ్చిన బడ్జెట్‌లో ఇప్పటివరకు సుమారు 7 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేయగా ఇంకా రూ.8 కోట్లకు అప్‌లోడ్ చేయాల్సి ఉందని సమాచారం. కాగా, కాంట్రాక్టర్లు పర్సంటేజీ ఇవ్వకపోవడంతోనే కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా బిల్లులను అప్‌లోడ్ చేయడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పటికే పనులు చేసి ఐదేళ్లు దాటడం, పెట్టిన పెట్టుబడికి వడ్డీలు తడిసి మోపెడవడంతో నీరు-చెట్టు కాంట్రాక్టర్లు ఆర్థికంగా చితికిపోయి ఉన్నారు. కోర్టులో పోరాటం ఫలితంగానైనా బిల్లులు తెచ్చుకుందాంలే అనుకున్న వారి ఆశలకు ఇరిగేషన్ అధికారుల రూపంలో గండిపడుతోంది.

వేగంగా అప్‌లోడ్ చేస్తున్నాం

నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు బడ్జెట్ విడుదలైన మాట వాస్తవమే. వీలైనంత వేగంగా బిల్లులను అప్‌లోడ్ చేస్తున్నాం. బిల్లుల అప్‌లోడ్‌కు ఇప్పుడు అన్ని రికార్డులను డిజిటలైజేషన్ చేసి జేఈ, డీఈ, ఈఈల లాగిన్‌లో ఆమోదించాల్సి ఉండడంతో కొంత ఆలస్యం జరుగుతోంది. వీలైనంత త్వరగా బిల్లులను అప్‌లోడ్ చేసి ఎవరికీ ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- నాగరాజు, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ

సోమశిలలో 27.379 టీఎంసీలు నీరు



అనంతసాగరం, జనవరి 25: సోమశిల పూర్తి సామర్థ్యం 77టీఎంసీలు కాగా గురువారం నాటికి జలాశయంలో 27.379 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2300, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వారు తెలిపారు.



విద్యుద్దీప వెలుగుల్లో కలెక్టరేట్



గణతంత్ర వెలుగులు

- ముస్తాబైన పోలీస్ కవాతు మైదానం
- అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు

75వ గణతంత్ర దినోత్సవ నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లా పాలన కేంద్రం కలెక్టరేట్‌ను విద్యుద్దీప వెలుగుల్లో నింపేశారు. జిల్లా కేంద్రం నెల్లూరులో జరిగే కార్యక్రమానికి పోలీస్ కవాతు మైదానాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. ప్రముఖులు విచ్చేస్తుండటంతో భద్రతనూ కట్టుదిట్టం చేశారు. తాము సాధించిన ప్రగతిని అతిథులకు చూపెట్టేందుకు ఆయా శాఖల అధికారులు శకటాలను సిద్ధం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించనున్నారు. కాగా, విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం జేసీ రోణంకి కూర్మనాథ్, డీఆర్వో లవన్న, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరినీ డీఎఫ్ఎండీ ద్వారా తనిఖీ చేసి లోపలకు పంపాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

- నెల్లూరు(హరనాథపురం)



ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ



నిరాడంబర నేతకు అత్యున్నత పురస్కారం

పద్మ విభూషణుడు మన వెంకయ్య!

చవటపాళెం నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగిన నేత

వినమ్రంగా స్వీకరిస్తున్నా..

"అమృత కాలం దిశగా భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ ప్రభుత్వం ప్రకటించిన పద్మ విభూషణ్ పురస్కారాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నాను. దేశంలోని రైతులు, యువత, మహిళలు సహా నవ భారత నిర్మాణంలో భాగస్వాములు అవుతున్న ప్రతి ఒక్కరికీ నా పురస్కారాన్ని సగర్వంగా అంకితం చేస్తున్నా. ఈ పురస్కారం నా బాధ్యతను మరింతగా పెంచిందని భావిస్తూ నవభారత నిర్మాణం దిశగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఆకాంక్షిస్తున్నాను. శక్తివంతమైన, ఆత్మనిర్భర భారత నిర్మాణానికి ప్రజలతో కలిసి నడుస్తానని సవినయంగా తెలియజేస్తున్నా"

నెల్లూరు (ఆంధ్రజ్యోతి/క్రైం)/వెంకటాచలం, జనవరి 25 : క్రమశిక్షణ, పట్టుదల, నమ్మిన సిద్ధాంతాన్ని అంటిపెట్టుకుని ఉండటం, విలువలు పాటించడంతోనే జిల్లాకు చెందిన ముప్పవరపు వెంకయ్యనాయుడు రాష్ట్రపతి పదవి వరకు ఎదిగారు. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆయన తన అత్త, మామలు, సోదరీమణుల ఆప్యాయత అనురాగాల మధ్య పెరిగారు. నెల్లూరులోని వీఆర్ కళాశాలలో చదివే సమయంలో వెంకయ్యనాయుడు విద్యార్థి సంఘ నాయకుడిగా ఎదిగారు. ఒక విధంగా చెప్పాలంటే ఇక్కడి నుంచే ఆయన రాజకీయాలవైపు వెళ్లేందుకు బీజం వేసింది . తొలిసారిగా వీఆర్ కళాశాల విద్యార్థి సంఘ ఉపాధ్యక్ష పదవిని చేపట్టిన వెంకయ్యనాయుడు విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేశారు. మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. వెంకయ్యనాయుడులోని చురుకుదనం, మొక్కవోని వ్యక్తిత్వం, వెనుతిరగని మనస్తత్వం తదితర లక్షణాలు అప్పట్లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉన్న దుర్గాప్రసాద్‌ను ఆకర్షించాయి. ఫలితంగా వెంకయ్యను దుర్గాప్రసాద్ మరింత క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా మార్చారు. దేశభక్తిని, ఆర్ఎస్ఎస్ భావజాలన్ని వెంకయ్యనాయుడు చిన్నతనంలోనే నరనరాన నింపుకున్నారు. వెంకయ్యనాయుడు తన రాజకీయ జీవితంలో సైద్ధాంతిక పోరాటం చేశారేతప్ప వ్యక్తులతో పోరాటం చేయలేదు. ఆయన ఏవ్యక్తిని, ఏ నాయకుడిని వ్యక్తిగతంగా విమర్శించిన దాఖలాలుల లేవు. ఈకారణం చేతనే ఆయనకు దేశవ్యాప్తంగా ప్రత్యర్థులు లేనటంలో అతిశయోక్తి లేదు.

● అసెంబ్లీ టైగర్‌గా పేరు

వెంకయ్యనాయుడు చిన్నతనం నుంచి హుందాగానే రాజకీయాలు చేశారు. 1977లో ఆయన జనతాపార్టీ అభ్యర్థిగా ఒంగోలు పార్లమెంటు స్థానం నుంచి పోటీ ఓడిపోయారు. తరువాత 1978లో జనతా పార్టీ నుంచి, 1983లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1985లో జరిగిన ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 1978 నుంచి ఆయన శాసనసభలో తన వాగ్ధాటితో అవినీతి, అక్రమాలపై చర్చిస్తూ అసెంబ్లీ టైగర్‌గా గుర్తింపు పొందారు. 1983లో విజయం సాధించిన తరువాత రాష్ట్రంలో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాదెండ్ల భాస్కర్‌రావు కూలదోసిన సమయంలో జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో వెంకయ్యనాయుడు అత్యంత కీలకంగా వ్యవహరించారు.

● ఎన్నో సేవలు, మరెన్నో ప్రశంసలు

మారుమూల గ్రామం నుంచి అంచలంచెలుగా ఎదిగి ఉన్నత పదవులు అలంకరించిన వెంకయ్యనాయుడు రాజకీయలతోపాటు సేవా కార్యక్రమాల్లోనూ తనదైన ముద్రవేశారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అని నమ్మే వెంకయ్య కన్నతల్లిని, మాతృభాషను, జన్మభూమిని ఎప్పటికీ మరవకూడదని తరచూ చెబుతుంటారు. ఆయన మాటల్లో చెప్పటమే కాకుండా చేతల్లోనూ చేసి చూపించారు. స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న వెంకయ్య రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంతోమంది నుంచి ప్రశంసలు అందుకున్నారు.

● కుటుంబ నేపథ్యం

పూర్తి పేరు : ముప్పవరపు వెంకయ్యనాయుడు
సతీమణి : ముప్పవరపు ఉషమ్మ
సంతానం : కుమారుడు : హర్షవర్ధన్
కుమార్తె : దీపావెంకట్

● బాల్యం, విద్యాభ్యాసం

1949 జూలై 1న నెల్లూరుజిల్లాలోని వెంకటాచలం మండలం చవటపాళెంలోని ఓ వ్యవసాయ కుటుంబంలో రంగయ్య నాయుడు, రమణమ్మ దంపతులకు వెంకయ్య జన్మించారు. బుచ్చిరెడ్డిపాలెం హైస్కూలులో విద్యను, వీఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఆ తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు.

సార్వత్రిక ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ప్రజలను ఆకట్టుకునేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధమైంది. 2019లో అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి పేదోడి సొంతంటి కల టిడ్కో ఇళ్లను మూలనపడేసిన వైసీపీ ప్రభుత్వం తాజాగా మళ్లీ వాటిని పంపిణీ చేస్తామంటూ తెరపైకి తీసుకువస్తుంది. ఎప్పుడో పంపిణీకి సిద్ధమై రూపు కోల్పోయిన ఇళ్లకు రంగులు రుద్ది ఈ నెలాఖరున లబ్ధిదారులకు అందచేయాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. తొలుత 30వ తేదీ పంపిణీ చేయాలని హంగు, ఆర్భాటాలతో అంతంతా మాత్రంగా సౌకర్యాలు కల్పించిన అధికారులు ఆపై ఎప్పుడన్నది స్పష్టమైన ముహూర్తాన్ని ప్రభుత్వం ప్రకటించలేదు.

ఈ నెలాఖరుకు 'టిడ్కో' ఇళ్ల పంపిణీ?

15,570 గృహాలు అందచేసేందుకు ప్రణాళిక



అక్కచెరువుపాడు వద్ద ప్రారంభానికి సిద్ధమైన టిడ్కో కాంప్లెక్స్

ఎన్నికల వేళ.. నెరవేరనున్న కల

నెల్లూరు(సిటీ), జనవరి 25 : నెల్లూరు నగర పరిధిలోని వెంకటేశ్వరపురం 1, 2 విడతలతోపాటు అల్లీపురం, కల్లూరిపల్లి, కొండ్లపూడి, ఇరగాళమ్మ సంఘం, అక్కచెరువుపాడు ప్రాంతాలలో టిడ్కో ఇళ్ల సముదాయాలను టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. మొత్తం 27 వేల మందికి 300, 365, 430 చ.అ విస్తీర్ణంలో ఇళ్లను నిర్మిం చారు. వాటిల్లో వెంకటేశ్వరపు తొలి ఫేజ్‌లో 4 వేల మందికి ఇప్పటికే ఇళ్లను అందచేసిన అధికారులు రెండవ ఫేజ్‌తోపాటు అల్లీపురం, కల్లూరి పల్లి, అక్క చెరువుపాడు, కొండ్ల పూడి, ఇరగాళమ్మ సంఘం ప్రాంతాలలో మిగిలిన 23 వేల ఇళ్లకు గాను 15,570 ఇళ్లు సిద్ధం చేశారు. వీటిని ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారులకు అంద చేసేందుకు టిడ్కో సిద్ధమైంది. ఈ నెలాఖరున లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో టిడ్కో, కార్పొరేషన్ అధికారులు ప్రణాళిక తయారు చేశారు. మిగిలిన ఇళ్లను మరో మూడు నెలల్లో ఇవ్వనున్నట్లు టిడ్కోలో ఓ అధికారి వెల్లడించారు.

పేదలకు ఉచితంగా అందచేసే 300 చ.అ విస్తీర్ణం కలిగిన ఇళ్లను అత్యధికంగా సిద్ధం చేసిన అధికారులు రూ. 25 వేల డిపాజిట్‌తో అందించే సింగల్ బెడ్‌రూం, రూ.50 వేల డిపాజిట్‌తో అందించే డబుల్ బెడ్‌రూం ఇళ్లను అయినకాడికి సిద్ధం చేశారు. మొత్తంగా 15,570 ఇళ్లను ఈ నెలాఖరున పంపిణీకి కసరత్తు చేస్తున్నారు. కాగ ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన ముహూర్తం ఖరారు కాకపోవడంతో కాస్త ఆందోళనలో పడిన యంత్రాంగం లబ్ధిదారులకు మాత్రం సమాచారం అందిస్తున్నారు.

ఖరారు కాని ముహూర్తం

● ఎన్నికల వేళ హడావుడి

సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న సమయంలో పేద, మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకునేందుకు జగన్ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను ఎరగా వేస్తోందని విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. 2019లో అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి టిడ్కో గృహాలపై లేని ప్రేమ హఠాత్తుగా రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా సమాధానం కూడా ఇవ్వని అధికారులు ఇప్పుడు మీకు ఇల్లు ఇస్తాం రండీ అంటూ ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారని చెబుతున్నారు.

నైతిక విలువలతో ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 25 : నైతిక విలువలతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో 14వ జాతీయ ఓటరు దినోత్సవ సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. భావితరాలకు ప్రజాస్వామ్య విలువలను అందించేలా, దేశం అత్యంత శక్తివంతంగా తయారయ్యేలా యువకులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. ఓటు హక్కుతోనే సరైన వ్యక్తిని ఎన్నుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు, అధికారులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జేసీ, డీఆర్వో లవన్న, ఆర్డీవో మలోల, ట్రాఫిక్ డీఎస్పీ సుభాన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

కార్పొరేషన్ కమిషనర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ అవార్డు



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న కమిషనర్ వికాస్

నెల్లూరు (సిటీ),జనవరి 25 : లోపాలు రహితంగా ఓటర్ల తుది జాబితాను రూపొందించడంలో ప్రతిభ కనపరిచినందుకు నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును అందించింది. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సం సందర్భంగా విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి అవార్డును అందుకున్నారు. నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఈఆర్వోగా వ్యవహరిస్తున్న కమిషనర్ ఇటీవల సమ్మరీ రివిజన్ అనంతరం ముసా యిదా ఓటరు జాబితా తయారీ, అందిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి తుది జాబితా తయారీలో నాణ్యతకు ప్రాధాన్య మిస్తూ జాబితా రూపకల్పన చేసినందుకు ఈ అవార్డు కమిషనర్‌కు దక్కింది.

ఓటు హక్కు కీలక ఆయుధం : ఎస్పీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైం): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన ఆయుధమని ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వర రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పోలీసు పరేడ్ మైదానంలో గురువారం ఓటు హక్కు వినియోగంపై సిబ్బందితో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కాగా, జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

ఓటు విలువ తెలుసుకో..: డీఎంహెచ్‌వో



ప్రమాణం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నెల్లూరు (వైద్యం): ప్రతి ఒక్కరు ఓటు విలువను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవా లని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఆయన ప్రమాణం చేశారు. అర్హులం దరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకు నేలా చైతన్య వంతులు కావాల న్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీల్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

సున్నా వడ్డీ రాయితీకి మంగళం

- రెండేళ్లుగా రైతుల ఖాతాలో జమ కాని నగదు
- నీరుగారుతున్న పథకం... అల్లాడుతున్న అన్నదాతలు



నెల్లూరు (వ్యవసాయం), జనవరి 25 : రైతులకు రుణాలు మంజూరు చేయడం... సకాలంలో రుణాలు చెల్లించిన వారి ఖాతాల్లో వడ్డీ జమ చేయడం వల్ల అన్న దాతలకు ఆర్థికంగా ఎంతో స్వాంతన చేకూరేది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక రుణాలు సక్రమంగా ఇవ్వకపోగా, తీసుకున్న రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ సొమ్ము చెల్లించడం లేదు. గత రెండేళ్లుగా ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం లక్ష్యం నీరుగారిపోయింది. ఫలితంగా అన్నదాతలు అల్లాడిపోతున్నారు.

● నెరవేరని లక్ష్యం

రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేసి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వాలు వారికి రుణాలు అందించే దిశగా ప్రణాళికలు రూపొందించాయి. తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా సకాలంలో చెల్లించిన రైతులకు వారు చెల్లించిన వడ్డీని తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తాయి. దీనివల్ల వారికి ఆర్థిక వెసులుబాటు కలుగుతోంది. ఇదీ పంట రుణాల సున్నావడ్డీ పథకం లక్ష్యం. టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సకాలంలో వడ్డీ చెల్లింపులు జరిగేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి తారుమారైంది. 2021-22 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి జిల్లాలో 15,032 మంది అర్హులైన లబ్ధిదారులు దాదాపు రూ.3,27,40,317ల వడ్డీ రాయితీ నగదు కోసం ఎదురు చూస్తున్నారు. ఇంకా 2022-23 ఖరీఫ్ సీజన్‌లో 85,326 మంది, రబీలో 80,859 మంది రైతులు రుణాలు తీసుకుని ఉన్నారు. ఇదిలా ఉంటే ఈ నెలాఖరులో వడ్డీ రాయితీ జమ అయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

● సకాలంలో చెల్లిస్తున్నా...

రూ.లక్షలోపు రుణాలు తీసుకుని సకాలయంలో చెల్లించిన రైతులకు సీజన్ పూర్తయ్యేలోగా సున్నా వడ్డీ రాయితీ నగదు జమకావాల్సి ఉంది. 2021-22లో ఖరీఫ్, రబీ సీజన్లలో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 15,032 మంది రైతుల జాబితాను బ్యాంకర్లు సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేశారు. అయితే వారికి నగదు జమ ఎప్పుడు అవుతుందో స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో వివాదం

- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



క్రీడా మైదానంలో వివాదాన్ని అడ్డుకున్న పోలీసులు

పొదలకూరు, జనవరి 25 : పొదలకూరు పట్టణానికి సమీ పంలో ఉన్న కాకాణి రమణారెడ్డి స్టేడియంలో జరుగుతున్న నియో జకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో వివాదం చోటుచేసుకుంది. బాలుర కబడ్డీ విభాగంలో నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానాన్ని తోటపల్లిగూడూరు జట్టు కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానాన్ని మనుబోలు మండలం జట్టు చేజిక్కించుకుంది. తృతీయ స్థానం కోసం వెంకటాచలం, పొదల కూరు జట్లు తలపడ్డాయి. ఈ నేపథ్యంలో పొదలకూరు కబడ్డీ జట్టు 17 పాయింట్లు స్కోర్ చేయగా, వెంకటాచలం జట్టు 7 పాయింట్లు స్కోర్‌లో ఉన్న సమయంలో పొదలకూరు జట్టు నుంచి రైడింగ్ వెళ్లిన వ్యక్తి ముగ్గురిని అవుట్ చేసి 3 పాయింట్లు సాధించాడు. ఆ ముగ్గురు వ్యక్తులు కోర్టు నుంచి బయటకు వెళ్లాలని రెఫరీ సూచించారు. వెంకటాచలం జట్టు నుంచి ఇద్దరు మాత్రమే కోర్టు బయటికి వెళ్లారు. మరొకరు తాను అవుట్ కాలేదని వాదిస్తుండగా పక్కనున్న సపోర్టర్లు క్రీడాకారుడికి అనుకూలంగా రెఫరీ మీదకు రావడంతో వివాదం మొదలైంది. కుర్చీలు విసిరికొట్టుకున్నారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఇంక రెండు నిమిషాలే ఉండడంతో 17 పాయింట్లతో ఉన్న పొదలకూరు జట్టును తృతీయ స్థానానికి ఎంపిక చేశారు.

● బుచ్చిలోనూ గొడవే..

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక డీఎల్ఎన్ఆర్ హైస్కూలు ప్రాంగణంలో గురువారం జరిగిన ఖోఖో పోటీలో ఎంపైర్లు, రెఫరీ, ఛీఫ్ రెఫరీలు ఏకపక్ష నిర్ణయంతో విడవలూరు జట్టును విజేతగా ప్రకటించారని ఇందుకూరుపేట మండలం కొమరిక జట్టు కెప్టెన్ శీను, మనోజ్ వాపోయారు. విడవలూరు మండలం ఊటుకూరు-2 సచివాలయం జట్టుకు, కొమరిక జట్టు మధ్య ఫైనల్ పోటీ జరిగింది. అయితే, పోటీలో తమకు అన్యాయం జరిగిందంటూ కొమరిక జట్టుకు నుంచి మునగశెట్టి మనోహర్ స్పందనకు ఫిర్యాదు చేశారు. ఐతే చీఫ్ రెఫరీ మధు కొమరిక జట్టు వెళ్ళిపోవడంతోనే ఊటుకూరు జట్టును విజేతగా ప్రకటించినట్టు చెబుతున్నా రు. ఈ వ్యవహారంపై 'జగనన్నకు చెబుదాం'కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు మనోహర్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

- అదుపులోకి ఆరుగురు, రూ.8.500 స్వాధీనం

కొండాపురం, జనవరి25: పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు.ఈ సంఘటన మండలంలోని తూర్పుఎర్రబల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఖాజావలి కథనం మేరకు, గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

ఫ్యాన్సీ షాపులో అగ్నిప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 25: స్థానిక గిరిజాహాల్ సెంటర్లో అనిల్ అనే వ్యక్తికి చెందిన ఫ్యాన్సీ షాపులో గురువారం వేకువజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయాన్నే ఫ్యాన్సీ షాపులో నుంచి పొగలు వస్తుండడాన్ని గమనించిన స్థానికులు యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే షాపు వద్దకు చేరుకున్న అనిల్ దుకాణం తలుపులు తెరచి చూసే సరికి దుకాణంలోని ప్లాస్టిక్ సామాన్లు, ఫ్యాన్సీ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ. 10లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగిందని అనిల్ పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

44 మద్యం సీసాల స్వాధీనం



పట్టుబడిన నిర్వాహకుడు, మద్యం సీసాలతో ఎస్ఐ అజయ్‌కుమార్

మనుబోలు, జనవరి 25: మండలంలోని గురివిందపూడి గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై ఎస్ఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో బుధవారం రాత్రి దాడి చేశారు. చల్లా వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 44 మద్యం సీసాలు స్వాధీనం చేసు కున్నారు. గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

29 మద్యం సీసాలు..

ఉదయగిరి రూరల్, జనవరి 25: మండలంలోని గండిపాళెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ దుకాణంపై బుధవారం రాత్రి ఎస్ఐ కె ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి దాడిచేశారు. 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని చుండ్రు వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రూ. 3.50 లక్షల నగదు..



రాపూరులో విలేఖర్లతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

రాపూరు(డక్కిలి), జనవరి 24 : రాపూరు మద్దెలమడుగు సెంటరులో గురువారం పోలీసుల తనిఖీలో రూ. 3.50 లక్షల నగదు పట్టుబడినట్లు సీఐ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ విజయవాడకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి నుండి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ఆధారాలు చూపి నగదు తీసుకెళ్లవచ్చని సీఐ తెలిపారు. కాగా, రాపూరులో ఎన్నికలకు సంబంధించి తనిఖీలు ముమ్మరం చేసినట్లు, ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ మాలాద్రి వున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5947
వెండి కిలో ధర	రూ. 73,100
వెండి ఒక గ్రాము	రూ. 75.10

ఏఎస్ పేట దర్గా హుండీల ఆదాయం రూ.1.16 కోట్లు

- రాష్ట్రంలోనే మొదటి స్థానం

ఏఎస్‌పేట, జనవరి 25: హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గాలో గత 5రోజులుగా జరుగుతున్న హుండీల లెక్కింపు కార్యక్రమం గురువారం సాయంత్రం పూర్తయింది. హుండీల ద్వారా 1 కోటి 61లక్షల 7వేల 998రూపాయల నగదు, 26గ్రాములు బంగారం, 7కేజీల 149గ్రాములు వెండి భక్తులు అందించారని దర్గా ఈవో హుసేన్ తెలిపారు. వాటిని దర్గా ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. దర్గా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలోకి వచ్చాక భక్తులు 91 లక్షలు విరాళాలుగా అందించారని తెలిపారు. హుండీలు, విరాళాల ద్వారా సుమారు రూ. 2.52 కోట్లు రావడం దర్గా చరిత్రలోనే మొదటిసారి కావడం విశేషం. రాష్ట్రంలోనే ఇంత ఆదాయం గల దర్గా లేదన్నారు.

'పది' పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

- పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ దేవానందరెడ్డి

నెల్లూరు (విద్య), జనవరి 25 : ఈ ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఏపీ పరీక్షల విభాగం డైరెక్టర్ డీ దేవానందరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పర్యటనలో భాగంగా నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. త్వరలో జిల్లాస్థాయి సమీక్ష నిర్వహిస్తామని, సంబంధిత అధికారులు, సిబ్బంది సమాయత్తం కావాలని సూచించారు. పరీక్షలు పూర్తయిన తర్వాత నిర్వహించే స్పాట్ వాల్యుయేషన్‌కు కూడా పూర్తిస్థాయిలో సదుపాయా లు కల్పించాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు అందినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలించిన సూచలిస్తున్న అజీజ్

నెల్లూరు (వైద్యం), జనవరి 25 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభకు సంబంధించిన ఏర్పాట్లను టీడీపీ, జనసేన పార్టీ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ నెల 28వ తేదీన నెల్లూరులోని శ్రీ వేణుగోపాల్‌స్వామి కళాశాల మైదానంలో ఈ సభ జరగనుంది. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, నేత వేమిరెడ్డి పట్టాభిరామరెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు, టీడీపీ నేతలు బాలాజీ, సాబీర్ ఖాన్, ప్రశాంత్, జాకీర్, జనసేన నేతలు ఆలియా, కొట్టే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌కు మునిసిపల్ స్కూలు విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

నెల్లూరు (విద్య), జనవరి 25 : చత్తీస్‌ఘడ్‌లో ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ అండర్-19 పోటీలకు నగరంలోని నవాబుపేట బీవీఎస్ మునిసిపల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని జీ పురందేశ్వరి ఎంపి కయ్యారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు పీవీ జయజ్యోతి మాట్లాడుతూ కడప జిల్లా రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పురందేశ్వరి జాతీయ జట్టుకు ఎంపికైందన్నారు. జాతీయ స్థాయిలోనూ రాణించి రాష్ట్ర, జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పీ అజయ్‌కుమార్, రేవతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లావాసికి మహోన్నత సేవా పురస్కారం

- శ్రీహరి రావును ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం
- గుంటూరులోని విజిలెన్సు శాఖలో విధులు



అక్కిశెట్టి శ్రీహరిరావు

నెల్లూరు (క్రైం), జనవరి 25 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పోలీసు శాఖ సిబ్బందికి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసెస్ (ఎంఎస్ఎం) పురస్కారాలను గురువారం ప్రకటించింది. రాష్ట్రంలో ఈ పురస్కారానికి తొమ్మిది మంది ఎంపికవగా, జిల్లాకు చెందిన ఇన్‌స్పెక్టర్ అక్కిశెట్టి శ్రీహరి రావు ఎంపికయ్యారు. కొడవలూరు మండలం నాయుడు పాలెంకు గ్రామానికి చెందిన శ్రీహరి రావు 2002లో రిజర్వు ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరారు. ప్రకాశం జిల్లా మార్కాపురం సబ్ డివిజన్‌లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నాలుగేళ్లపాటు ఆయన చురుగ్గా విధులు నిర్వహించారు. 2016లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది నెల్లూరు జిల్లా అవినీతి నిరోధక శాఖలో మూడేళ్లపాటు విధులు నిర్వహించారు. 2019లో రాజధాని ప్రాంతమైన తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. 2021 నుంచి గుంటూరులోని విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్రం మహోన్నత సేవా పురస్కారానికి ఎంపిక చేసింది.

కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలించే ప్రసక్తే లేదు!

- నెల్లూరులో మంత్రి కాకాణి స్పష్టం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 25 : కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను తరలించే ప్రసక్తే లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెర్మినల్ మూయడం, తరలింపు ప్రక్రియపై పోర్టు యాజమాన్యం ఏదైనా నిర్ణయం తీసుకుంటే తానే పోరాటం చేస్తానని చెప్పారు. పోర్టుపై ఊహాగానాలను ఎవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు హయాంలో కృష్ణపట్నం పోర్టుకు శంకుస్థాపన జరిగిందని, వైఎస్సార్ హయాంలో పోర్టు నిర్మాణం పూర్తయినట్లు గుర్తు చేశారు. పోర్టు ద్వారా ఎందరికో ఉపాధి లభిస్తోందని అన్నారు. అయితే కొన్ని మీడియాలలో వచ్చిన కథనాలపై పోర్టు యాజమాన్యంతో చర్చించినట్లు చెప్పారు. పోర్టు వ్యాపారం రోజు రోజుకూ పెరుగుతోందన్న ఆయన కంటైనర్ టెర్మినల్ తరలించాలన్న ఉద్దేశం లేదన్నారు. రాజకీయ లబ్ధికోసం టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం పోర్టు ఎక్కడికీ పోదని కాకాణి స్పష్టం చేశారు.

సాగునీరందక వరిలో బీటలు



బోగోలు మండలంలోని పలు ప్రాంతాలకు సక్రమంగా సాగునీరు అందక లేత వరి పైరు ఎండుముఖం పడుతోంది. కడనూతల చెరువులో సమృద్ధిగా నీరున్నా కూడా ఆయకట్టు కు విడుదల చేయలేదు. ముంగమూరు చెరువులో నీరు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెల్లగుంట గ్రామ పొలాలకు కూడా నీరందడం లేదు. డీఎం చానల్, ఎస్సీ పీఎం చానల్ అయినా చెరువులకు సాగునీరు అందచేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

- బిట్రగుంట

చేయి తడిపితేనే ముందుకు!

మర్రిపాడులో పోలీసుల అక్రమ వసూళ్లు ● సామాజిక మాధ్యమాల్లో డ్రైవర్ల నుంచి నగదు వసూలు ఫొటోలు



లారీని ఆపి డ్రైవర్ నుంచి నగదు తీసుకుంటున్న కానిస్టేబుల్

మర్రిపాడు, జనవరి 25 : మండలంలో పోలీసుల అక్రమ వసూలుకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. నిత్యం లారీలు, ఇతర రవాణా వాహనాలు ఎక్కువగా తిరిగే నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపైనే వారు దృష్టి పెడుతు న్నారు. తనిఖీల పేరిట అడిగినంత డబ్బు ఇవ్వకుంటే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వాహనదారులను బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో బొగ్గేరు నుంచి ఇసుక రవాణా జరుగుతుండగా, నిత్యం తిరిగే ఆయిల్ ట్యాంకర్లు, చికెన్ వ్యర్థాలను తరలించే వాహనాల నుంచి నెల మామూళ్లు పోలీసులకు నెల మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇవికాకుండా బయట జిల్లా నుంచి వచ్చే వాహనదారుల నుంచి కూడా ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేసిన నగదును స్టేషన్‌లో సిబ్బంది, అధికారుల వారీగా పంచుకుంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం పోలీసు స్టేషన్ ఎదుట చికెన్ వ్యర్థాలతో వెళ్తున్న ఓ లారీని పోలీసులు ఆపారు. ఆయన నుంచి నగదు తీసుకుంటున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఇలా ఇప్పటికే పలుమార్లు మర్రిపాడు పోలీసులపై పత్రికల్లో కథనాలు వచ్చినా వారి ప్రవర్తనలో మార్పు కనిపించడం లేదు.

కార్పొరేషన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం



కమాండ్ కంట్రోల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు (సిటీ), జనవరి 25 : నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కమాండ్ కంట్రోల్ భవనాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి రిబ్బన్ కట్‌చేసి భవనంలోకి అడుగుపెట్టారు. వారంతా మాట్లాడుతూ ఈ భవనం అందుబాటులోకి రావడంతో నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందుతా యని తెలిపారు. నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఇక్కడి నుంచే పర్యవేక్షించ వచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవడం ద్వారా నగరవాసులకు సత్వర సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ఉండాలి

- ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణయ్య

నెల్లూరు (వైద్యం), జనవరి 25 : జిల్లాలోని గ్రామీణ వైద్యులు కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య సూచించారు. విజయవాడలో గ్రామీణ వైద్యుల మహాసభ, కేన్సర్‌పై అవగాహన పోస్టర్‌ను గురువారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంపీలు, ఆర్ఎంపీలు, వైఎస్సార్ ఆరోగ్య విభాగం సభ్యులు కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామాల్లోనేకాకుండా అటవీ ప్రాంతాలు, సముద్ర తీరంలోనూ గ్రామీణ వైద్యుల సేవలతో ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. వచ్చే నెల 4న విజయవాడలో భారీ ర్యాలీ, మహాసభ నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీపీహెచ్‌పీడబ్ల్యూ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు రవీంద్రబాబు, రోజారాణి, షేక్ గౌస్‌బాషా, శాఖవరపు వేణుగోపాల్, చిట్టూరి వీరయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, విజయకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన యునెస్కో శిక్షణ తరగతులు

నెల్లూరు (విద్య), జనవరి 25 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యునెస్కో సెల్ అండ్ సీక్ శిక్షణ తరగతులు ఆసక్తిగా జరిగాయి. మూడు రోజులు జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులకు సెల్ఫ్ డైరెక్టెడ్ ఎమోషనల్ లెర్నింగ్ ఫర్ సింపథీ అండ్ కైండ్నెస్ అనే అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన గురువారం జరిగిన కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ వర్చువల్ విధానంలో సిబ్బందితో మాట్లాడారు. వసుధైక కుటుంబం అనే భారతీయ సంస్కృతి మూ లాలను విద్యార్థుల్లో నింపాలని, వారిలో ఎమోషనల్ వెల్ బీయింగ్ పర్సనాలిటీ రూపొందించా లన్నారు. నేర్చుకున్న అంశాలన్నీ కూడా తరగతి గదుల్లో విద్యార్థులకు తెలియచేసి వారిని ఉత్తమంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమానికి వర్చువల్ రీసోర్స్ పర్సన్స్‌గా ఎస్ఎస్ శోభిత, రీసోర్స్ పర్సన్లుగా డాక్టర్ సువర్ణ, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ కృష్ణమూర్తి వ్యవహరించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, పీఆర్వో జోజి. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బాంధవుడు గొట్టిపాటి

● వర్ధంతి సభలో టీడీపీ నాయకుల వెల్లడి


కావలి : మాట్లాడుతున్న బొల్లినేని రామారావు

కావలి, జనవరి 25: సోమశిల ఉత్తర (గొట్టిపాటి కొండపనాయుడు) కాలువ సాధన కోసం పోరాడిన మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి కొండపనాయుడు రైతు బాంధవుడని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, కావలి టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడులు పేర్కొన్నారు. కొండపనాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గొట్టిపాటి 22వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా పట్టణ ఏరియా వైద్యశాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేసి, ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ట్రస్ట్ బాధ్యతలు నిర్వహిస్తున్న జ్యోతి బాబూరావు అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో కొండపనాయుడు మనుమళ్లు కంచర్ల రమాధర్‌నాయుడు, బొబ్బూరు శ్రీరాములు, సురేష్, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, జనసేన నేత అళహరి సుధాకర్, బీజేపీ నేత కందుకూరు వెంకటసత్యనారాయణ, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మన్నవ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జలదంకి : కావలి మాజీ ఎమ్మెల్యే దివంగత గొట్టిపాటి కొండపనాయుడు వర్ధంతిని గురువారం జలదంకి, గట్టుపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. జలదంకి టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పీ .మధు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వర్గీయ గొట్టిపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగురైతు మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. గట్టుపల్లిలో ఉన్న గొట్టిపాటి విగ్రహానికి కాకర్లట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పచ్చా పెంచలయ్యనాయుడు, కంచర్ల వినోద్‌నాయుడు, మాలకొండయ్యనాయుడు, శ్రీహరి, మునగాల తిరుమలరెడ్డి, సురేశేషారెడ్డి, డాక్టర్ పి.వి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన పోవాలి - తెలుగుదేశం రావాలి

వింజమూరు: ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే అరాచక పాలన పోవాలని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు అన్నారు. మండల టీడీపీ కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి ఆధ్వర్యంలో ఉత్తర హరిజనవాడలో ప్రజాదీవెన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను అందజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చల్లా శ్రీనివాసులు, దంతులూరి వెంకటేశ్వరరావు, మంచాల శ్రీనివాసులు, గురజాల వాసు, జి.సుదర్శనరెడ్డి, కొండపల్లి వెంకటేశ్వర్లు, షేక్ ఖాజావలి, యారం కృష్ణయ్య, చావా మహేంద్ర, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మప్రచార వారోత్సవాలు


గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దుత్తలూరు (ఉదయగిరిరూరల్), జనవరి 25: మండలం లోని నర్రవాడలో ఉన్న శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి ఆలయంలో గురువారం ధర్మ ప్రచార వారోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణం నిర్వహించడంతో పాటు వడ్డిపాళెం, నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవవారిపాళెంలో గ్రామోత్సవం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భవిత కేంద్రం సందర్శన

కందుకూరు, జనవరి 25: పట్టణంలోని కోటకట్టవీధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని రాష్ట్ర ప్రత్యేక విద్య అసిస్టెంట్ కో ఆర్డినేటర్ జీ మల్లికార్జున గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందుతున్న విద్యాబోధన, వారం వారం ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రాన్ని తనిఖీచేసిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎంఈవో కూనం సుబ్బారెడ్డితో సమావేశమయ్యారు.

నాయీబ్రాహ్మణ సంక్షేమమే టీడీపీ ధ్యేయం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఉదయగిరి, జనవరి 25: నాయీబ్రాహ్మణ సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని నెల్లూరు పార్లమెంట్ నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు ఆళ్లూరు శ్రీహరి అన్నారు. గురువారం ఉదయగిరి నియోజకవర్గ సాధికార సమితి జిల్లా కమిటీ సభ్యుడు మైదుకూరు వెంకటసుబ్బయ్య, తాళ్లూరు రమణయ్య, పార్లమెంట్ కార్యదర్శిగా ఈదర శ్రీనివాసులును నియమించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణులు ప్రసాద్, వెంకట్ పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం

వరికుంటపాడు, జనవరి 25: విశిష్ట సేవలు అందించిన కరసేవకులకు గురువారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. వరికుంటపాడుకు చెందిన ఆంద్రా పరంధామిరెడ్డి, ఆంద్రా సావిత్రి నివాసాలకు వెళ్లి వారిని శాలువాలతో సన్మానించడంతో పాటు జ్ఞాపికలను అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రహదారి భద్రత నియమాలు పాటించండి


కావలి రూరల్ : లారీ డ్రైవర్లకు సేఫ్టీకోన్‌లు అందచేస్తున్న టోల్‌ప్లాజా మేనేజర్

కావలి రూరల్, జనవరి 25: రహదారి భద్రతలు పాటించినప్పుడే సురక్షితంగా గమ్యం చేరవచ్చని ముసునూరులోని సింహపూరి ఎక్స్ ప్రెస్ వే టోల్ ప్లాజా మేనేజర్ గణేష్ పేర్కొన్నారు. గురువారం 35వ జాతీ య భద్రతా మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం నేరమని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే 108, 1033 నెంబర్లకు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చన్నారు. అనంతరం లారీడ్రైవర్లకు సేఫ్టీ కోన్‌లు, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా రేసీ మేనేజర్ శ్రీమన్నారాయణ, రూరల్ హైవే మొబైల్ పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్కేఎండీ రఫీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. టీఆర్ ఆక్స్‌ఫర్డ్ కాలేజీ నుంచి ఏరియా హాస్పటల్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టౌన్ ఎస్‌ఐ హనీఫ్, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరక్టర్లు జి. బాలభాస్కరరావు, బి. నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా వికసిత్ భారత్ కార్యక్రమం

● అధికారులపై బీజేపీ నేతల ఆగ్రహం


ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు

అనంతసాగరం, జనవరి 25: మండలంలోని గౌరవరంలో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమం తూతూ మంత్రంగా నిర్వహించడం పట్ల బీజేపీ నాయకులు అధికారులను నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు వికసిత్ భారత్ కార్యక్రమం చేపట్టగా ప్రజలకు సమాచారం ఇవ్వకుండానే కార్య క్రమాన్ని ఎలా నిర్వహిస్తున్నారని ఎంపీడీవో మధుసుదన్‌రావును ప్రశ్నించారు. ప్రజలందరికీ తెలియపరిచి కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయులురెడ్డి, బుచ్చిరెడ్డి అల్లంపాటి రమణారెడ్డి తదితరులు డిమాండ్ చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వల్లూరు రాజేష్


మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడిగా వల్లూరు రాజేష్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కర్నాటి ఆంజనేయులురెడ్డి, అల్లంపాటి రమణారెడ్డి, బుచ్చిరెడ్డి, నాగరాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఏఈఆర్‌వోగా కందుకూరు కమిషనర్


కలెక్టరు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్

కందుకూరు, జనవరి 25: ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్‌వో)గా కందుకూరు మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ గురువారం జిల్లా కలెక్టరు హరినారాయణన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇటీ వల జరిగిన ఓటర్ల నమోదులో అత్య. దికమందిని నమోదు చేసేందుకు ఆయన ఈ అవార్డు అందుకున్నారు. పట్టణంలోని 111వ నెంబరు పోలింగ్ బూత్ బీఎల్వో ప్రవీణ్‌కు ఉత్తమ బీఎల్వోగా అవార్డు లభించింది. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.





యానాదులకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలి : కేసీ


యానాదులతో మాట్లాడుతున్న కేసీ పెంచలయ్య

సంగం, జనవరి 25: జిల్లాలోని యానాదులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని యానాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెసి పెంచలయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన సంగం మండలంలోని వంగల్లు యానాది కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికీ వెళ్లి యానాదుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాదులకు ఎమ్మెల్యే సీటు కేటాయించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని, లేకపోతే కోవూరు నుంచి యానాదుల సంఘం తరపున తాను పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్రబాబు, మహిళా అధ్యక్షురాలు ఉష, స్థానిక నాయకులు యల్లంపల్లి శ్రీనయ్య, ఇండ్ల శ్రీనయ్య, మల్లిక వెంకటేశ్వర్లు, యాకసిరి వెంకటరమణయ్య, కొమరగిరి కృష్ణయ్య, ఇండ్ల పేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఏఎన్ఎం శివకుమారి పై చర్యలు తీసుకోవాలి

కావలి, జనవరి 25: ఆశావర్కరు సుల్తాన్‌బీపై చేయిచేసుకున్న ఏఎన్ఎం శివకుమారిపై చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్స్(సీఐటీయూ) యూనియన్ అధ్యక్షురాలు వసుంధరాదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అడిషనల్ డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగి శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. వసుంధరాదేవి మాట్లాడుతూ బుధవారం ఎమ్పీడీవో ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్ సుల్తాన్‌బీని ఏఎన్ఎం శివకుమారి అసభ్యకరంగా మాట్లాడి కొట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పీ. పెంచలయ్య, యూనియన్ నాయకులు గాయత్రి, అన్నమ్మ పాల్గొన్నారు.

ఏఎస్ పేట ఎస్ఐగా ప్రసాద్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఏఎస్ పేట, జనవరి 25: ఏఎస్ పేట మండల ఎస్ఐగా గురువారం ప్రసాద్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలపై దృష్టి సారిస్తానని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షాలు తెలపారు.

దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌ల పంపిణీ

సీతారామపురం, జనవరి 25 : మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గురువారం దివ్యాంగుల సంక్షేమ సంఘం, అఖిల భారత సేవాసంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ మండలంలోని 40 మంది దివ్యాంగుల బస్‌పాస్‌లకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని, జిల్లా కోఆర్డినేటర్ వేణుగోపాల్ దివ్యాంగులకు టీషర్ట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి, ఎంఈవో మస్తాన్‌వలి, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వరికుంటపాడు, జనవరి 25: క్రీడలు ప్రతి ఒక్కరిలో మానసిక ఆరోగ్యం నింపుతాయని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ బాదం నారాయణరెడ్డి, ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. గురువారం నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా గణేశ్వరాపురం జట్టు ఖోఖో ఆటలో రన్నర్‌గా నిలవడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

కందుకూరు, జనవరి 25: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కదిరి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాజగోపాలబాబు, ఎన్. తిరుపతిస్వామి, అనూష, ఇంద్రజ, రామాంజనేయులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు ఓరుగంటి వెంకటేశ్వరరావు, మస్తాన్‌వలి, చుండూరి బాబూరావు, హజరత్, బీవీ కాశీరత్నం, పరుచూరి ఉషశిరీష, టి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ టీ ప్రసాద్ తెలిపారు. గురువారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు హైస్కూల్ నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.అనంతరం స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద మానవహారం నిర్వహించారు.ఎంఈవో-2 శివకుమార్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా నిర్వహణ

వలేటివారిపాలెం : మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అధికారులు మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలోనూ, ఎస్సీ కాలనీలోని రామాలయం వద్ద తూతూమంత్రంగా ప్రతిజ్ఞ చేసి మ.మ అనిపించారు. మండలంలో 46 పోలింగ్ కేంద్రాలు ఉన్నా ఏ ఒక్క పోలింగ్ కేంద్రంలోనైనా ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించలేదు. అంతేకాకుండా ఎక్కడా కూడా సీనియర్ ఓటర్లను పిలిచి సత్కరించలేదు. ర్యాలీలు నిర్వహించలేదు. ఓటర్లకు అవగాహన కల్పించలేదు.

ఆత్మకూరు : ప్రతి ఒక్కరూ ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీవో కె మధులత అన్నారు. పట్టణ సమీపంలోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. ముందుగా మున్సిపల్ బస్టాండ్ సెంటర్ నుంచి బిఎస్ఆర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వీఆర్‌వోలు, వీఆర్ఏలు, బీఎల్‌వోలు, పాల్గొన్నారు.

● దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే..

కాగా దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని బీజేపీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో నూతన ఓటర్లకు దేశ ప్రధాని నరేంద్రమోడీ లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి ఓటు అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాలం బుజ్జిరెడ్డి, కంది మల్లి కార్జునరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు పి క్రిష్ణ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టి, బస్టాండు సముదాయంలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యత తదితర అంశాలపై తహసీల్దారు పి క్రిష్ణ వివరించారు. సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిపాడు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దారు ఆనందరావు స్థానిక హైస్కూల్ విద్యార్థులతో గురువారం బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, వీఆర్‌వోలు ఉన్నారు.

ఉదయగిరి : మండలంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్నికల అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఉదయగిరి తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్‌వో సానా శ్రీనివాసులురెడ్డి, సర్వేయర్ రవి పాల్గొన్నారు.

వింజమూరు : జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి బంగ్లా సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : సీనియర్ సిటిజన్లను సన్మానించిన అధికారులు


ఉదయగిరి : సీనియర్ సిటిజన్లను సత్కరించిన ఎన్నికల అధికారి ప్రేమ్‌కుమార్


వలేటివారిపాలెం : ఎంపీడీవో కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పేదలకు శుభ్రమైన నీరు అందించడమే లక్ష్యం


తాగునీటిని అందిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బిట్రగుంట, జనవరి 25: పేదలకు శుభ్రమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా వీపీఆర్ ఫౌండేషన్ పనిచేస్తున్నదని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలంలోని నాగులవరం, బంగారుపాలెం, జువ్వలదిన్నె గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను గురువారం స్థానికులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా జిల్లాలో 2017 నుంచి ఇప్పటి వరకు 130 మినరల్‌వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. కావలి నియోజకవర్గంలో 17 ప్లాంట్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో సర్పంచు రామారావు, వైసీపీ మండల కన్వీనర్ వీర రఘు, జడ్పీటీసీ ఎం కీర్తన, నాయకులు నలగట్ల శ్రీనివాసులురెడ్డి, బత్తల వినోద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సర్వాయపాలెంలోనూ...

కావలి : కావలి రూరల్ మండలం సర్వాయపాలెంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృతధార వాటర్ ప్లాంట్‌ను గురువారంఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఫారం-7 దుర్వినియోగంపై ఫిర్యాదు

లింగసముద్రం, జనవరి 25: మండలంలోని చినపవనిలో ఫారం-7 దరఖాస్తులను దుర్వినియోగం చేశారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని యూనిట్ ఇన్‌చారిజ సోంపల్లి మనోహర్, మరికొందరు గురువారం కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 11న గ్రామంలోని 70, 71, 72 పోలింగ్ బూత్‌లలో 49 ఓట్లను తొలగించేందుకు ఆన్‌లైన్‌లో ఫారం-7 దరఖాస్తులు పెట్టారని తెలిపారు.వీటిలో 22 ఓట్లను గుడ్లూరు మండలం పోట్లూరుకి చెందిన షేక్ యాసిన్ అనే వ్యక్తి ఫారం-7లను దరఖాస్తు చేశారన్నారు. ఫారం-7 దరఖాస్తులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసులు, ఎం మహేష్, పి బుచ్చయ్య చౌదరి, పి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో క్రీడాకారిణికి అనారోగ్యం

ఉలవపాడు, జనవరి 25: మండలంలోని కరేడు టెంకాయచెట్లపాలెంకు చెందిన వాయల రోహిణి కందుకూరులో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గురువారం అనారోగ్యానికి గురైంది. నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని తీవ్ర అనారోగ్యానికి గురైంది.దీంతో నిర్వాహకులు ఆమెను కందుకూరులోని ఓ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి వెంటనే రోహిణిని ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలకు తరలించి, తన స్వంత ఖర్చులతో మెరుగైన చికిత్స చేయించారు. సాయంత్రానికి డిశ్చార్జ్ చేశారు.

టీడీపీ వెంటే బీసీలు : నూకసాని


మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

గుడ్లూరు, జనవరి 25 : టీడీపీ వెన్నంటే బీసీలు నిలుస్తున్నారని, ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. అంతకుముందు ఎన్టీఆర్, అంబేడ్కర్, పూలే చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చెంచల బాబు, కుసుమకుమారి. చిలకపాటి మధు, నాగరాజు, మద్దసాని కృష్ణ, గద్దగుంట శ్రీనివాసులు, ఉమ్మడిప్రోలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ స్థానంలో కడనూతల కబడ్డీ జట్టు

బిట్రగుంట, జనవరి 25: బోగోలు మండలం కడనూతల మహిళా కబడ్డీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కావలిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో దగదర్తి జట్టు హాజరు కాకపోవడంతో కడనూతలలోని గడ్డం అమృత జట్టును పోటీలకు పంపారు. డివిజనల్ స్థాయికి వచ్చిన అమృత జట్టుకు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నగదు బహుమతి అందచేశారు. కావలి డీఎస్పీ వెంకటరమణ పోటీల్లో పాల్గొన్న మహిళలు కళ్యాణి, తనూజ, భవాని, అక్షయ, అనుపమలను అభినందించారు.

కావలిటౌన్ : స్థానిక జెడ్పీ మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గురువారం ఫైనల్స్ జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో శీనా నాయక్, డీఎస్పీ వెంకటరమణలు పాల్గొన్నారు. కబడ్డీ ఫైనల్స్‌లో కావలి మండలం, అల్లూరు మండలం జట్లు తలపడగా, కావలి విన్నర్‌గా, అల్లూరు రన్నర్‌గా నలిచాయి. వాలీబాల్ విన్నర్‌గా కావలి మండలం, రన్నర్‌గా బోగోలు మండలం జట్లు నిలిచాయి. క్రికెట్ విన్నర్‌గా కావలి మండలం, రన్నర్‌గా అల్లూరు జట్లు నిలిచాయి. పోటీల నోడల్ ఆఫీసర్ ఎండీవో కృష్ణారెడ్డి, కన్వీనర్ పీడీ చిరంజీవి పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కుందుర్తి కామయ్య, జనిగర్ల మహేంద్ర యాదవ్, పందిటి కామరాజు, వడ్లమూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రమణయ్య

కావలిటౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కావలి తాలూకా పింఛనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాయలం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య మాట్లాడుతూ పింఛనర్లకు చెల్లించాల్సిన డీఆర్, పీఆర్సీ అరియర్స్‌లు వెంటనే చెలించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధి రూ. 2లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సాయిసింగ్, వెంకయ్య పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్



కందుకూరు, జనవరి 25: ఏపీ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల నిర్వహణలో మెరుగైన ప్రమాణాలు నెలకొల్పటంతోపాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామన్నారు.

దివ్యాంగుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

కావలి, జనవరి 25: దివ్యాంగుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని కావలి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం దివ్యాంగులు మాలేపాటితో సమావేశమై తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం మాలేపాటి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో చంద్రబాబును సీఎంగా చేసుకుంటే దివ్యాంగులకు టీడీపీ చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్నవ వెంకట్రావు, పలువురు దివ్యాంగుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఐసీలో సత్తాచాటిన విద్యార్థినులు

బిట్రగుంట, జనవరి 25: బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు పీ.సుహిత, బీఎస్. దివ్యదర్శినిలు నేషనల్ సైన్స్ ఇన్నోవేషన్ చాలెంజ్(ఎన్ఎస్ఐసీ)లో తమ సత్తాచాటి పతకాలు, ప్రశంసాపత్రాలు పొందారు. ఈనెల 23, 24 తేదీల్లో బెంగళూరులో జరిగిన పోటీల్లో వారు ప్రతిభ చూపారని జిల్లా గురుకుల పాఠశాల సమన్వయకర్త టీ హేమలత గురువారం తెలిపారు. విద్యార్థినులు ప్రోత్సాహం అందించిన ప్రిన్సిపాల్ పద్మావతి, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని లావణ్యను ఆమె అభినందించారు.

బీజేపీలో చేరిన ఉన్నం భాస్కరరావు

కందుకూరు, జనవరి 25: స్థానిక ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు బీజేపీలో చేరారు. గురువారం విజయవాడలో ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా నాయకులు వంశీధర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, తొగంటి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు చుండి మురళీధర్, మాల్యాద్రినాయుడు, శ్రీధర్, మన్నేపల్లి వరప్రసాదరావు, వైకుంఠం తదితరులు ఉన్నారు.


గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

అల్లూరు, జనవరి 25 : గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్టు తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో జ్యోతిలు గురువారం తెలిపారు. శుక్రవారం జరగనున్న వేడుకల్లో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ఉదయం 8 గంటలకు జెండాను ఎగురవేస్తామన్నారు.

విద్యార్థుల రక్తదానం

కావలిటౌన్, జనవరి 25 : విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అభయం, సేవియర్స్ సంస్థల సహకారంతో 80మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ దత్తాత్రేయశర్మ, సురేష్‌లు రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో ఈడీ ఎన్ శేషయ్య, విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, ఇలీంద్ర వెంకటేశ్వర్లు, నూనె మోహన్ పాల్గొన్నారు.

28న ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంప్


మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌నాయుడు

కావలిటౌన్, జనవరి 25: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పీఎస్ఆర్ ట్రస్ట్ హాస్పిటల్‌లో ఈనెల 28న ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రభాకర్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చెన్నైకి చెందిన గ్లెనిగల్ హెల్త్ సిటీ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. నేడు అనేకమంది లివరు కేన్సర్‌తో బాధ పడుతున్నారని, లివర్ సమస్యలు సామాన్యంగా బయటపడవని తెలిపారు. రోగం ముదిరిపోయినప్పుడు మాత్రమే బయటపడుతుందన్నారు. ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నోటు పుస్తకాల పంపిణీ

విడవలూరు, జనవరి 25: మండల పరిధిలోని విడవలూరు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి వాళ్లకవి పద్మ శ్రీనివాసులు గురువారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు వల్లకవి చెంచుసుబ్బారావు, సుబ్బమ్మల జ్ఞాపకార్థం వీటిని అందచేశామన్నారు.

సీఐటీయూ నుంచి అంగన్‌వాడీల బహిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 25: సీఐటీయూ నుంచి 13 మంది అంగన్‌వాడీలను బహిష్కరిస్తున్నట్టు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఉపాధ్యక్షురాలు ఎల్‌వీ. శేషమ్మ, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆందోళనలకు వారు సహకరించకపోగా, ఆందోళనను విచ్ఛిన్నం చేసేలా ప్రవర్తించడంతో సీఐటీయూ నుంచి బహిష్కరిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

వేరుశనగ రైతులకు జిప్సం పంపిణీ

ముత్తుకూరు, జనవరి 25: కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త విజయ్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో ముత్తుకూరు మండల వ్యవసాయ కార్యాలయంలో గురువారం వేరుశనగ రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రంలో భాగంగా 50 మంది వేరుశనగ రైతులకు ఎకరాకు 4 బ్యాగుల చొప్పున జిప్సం పంపిణీ చేశారు. ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం తరపున ఇస్తున్న మందులు, ఎరువులను రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ముత్తుకూరు మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి మాట్లాడుతూ శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని సూచించారు.

ఫిబ్రవరి కల్లా వైసీపీ ఖాళీ!


టీడీపీలో చేరిన వారితో కలిసి అభివాదం చేస్తున్న సోమిరెడ్డి

సర్వేపల్లిలో ఆ పార్టీకి రివర్స్‌గేర్!
టీడీపీ నేత సోమిరెడ్డి వెల్లడి
'దేశం'లో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వెంకటాచలం, జనవరి 25 : వచ్చే ఫిబ్రవరి కల్లా సర్వేపల్లి నియోజక వర్గంలోని వైసీపీ పూర్తిగా ఖాళీ అయిపోవడం తథ్యమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొనానరు. గురువారం సాయంత్రం పాలిచెర్లపాడు గ్రామంలో సోమిరెడ్డి సమక్షంలో వైసీపీ నాయకుడు, వార్డు సభ్యుడు బిరుదోలు శంకర్ ఆధ్వర్యంలో 35 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు ఉంటాయన్నారు. సర్వేపల్లిలో వైసీపీకి రివర్స్ గేర్ ప్రారంభమైందన్నారు. మంత్రి కాకాణికి ఓటమి భయం పట్టుకుందని, దాంతోనే తనను నోటికి వచ్చినట్లుగా తిడుతున్నాడని, నీచమైన భాషలో తిడుతున్నందుకే కాకాణికి డాక్టరేటు వచ్చిందని మండిపడ్డారు. ఆయన పొగరును త్వరలోనే సర్వేపల్లి ప్రజలు దించుతారని, చాప చుట్టుకొని తోడేరు ఇంటికి వెళ్లి నిద్రపోవాలని ఎద్దేవా చేశారు. అంతకు ముందు పాలిచెర్లపాడులో 'బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్ర మంలో సోమిరెడ్డి పాల్గొన్నారు. ఇంటిం టికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. దోచుకోవడం, దాచుకోవడంలో కాకాణి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తాడని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాజాయాదవ్, రమేష్ నాయుడు, శ్రీనివాసులు, కొండప్ప, శ్రీకాంత్, సురేష్, రాఘవయ్య, రవీంద్ర, సులోచనమ్మ, కోదండయ్య, ధనుంజయ, ప్రభాకర్ పాల్గొన్నారు.

● టీపీ గూడూరులో 50 కుటుంబాలు..

తోటపల్లిగూడూరు : మండలంలోని మల్లికార్జునపురం గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 50 కుటుంబాలు కావల్‌రెడ్డి మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. అల్లిపురంలోని సోమిరెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో మల్లికార్జునపురం గ్రామంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు కోడూరు శ్రీనివాసులురెడ్డి, తాళ్లూరు వెంకటరమణయ్య, జీవ రత్నం, మారుబోయిన కాశీవిశ్వనాథ్, మన్నెం పుట్టయ్యగౌడ్, వెంపులూరు ప్రసాద్‌గౌడ్, నాశిన సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన


ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ శివకృష్ణయ్య

మనుబోలు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం మనుబోలు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ బి శివకృష్ణయ్య, డీటి శ్రీకాంత్ రెడ్డి, విఆర్‌వో నాగా ర్జున రెడ్డి, మురళీధర్, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా ఓటు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ కే సునీత తదితరులున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం ఓటు మన భవితకు ఆధారమని ఎంఈవో దిలీప్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక గోపాలకృష్ణయ్య స్కూల్లో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లా డారు. కార్యక్రమంలో ఎన్ శ్రీధర్, సురేఖ, గిరిజ, ఆమని, అనిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు.

శ్మశానానికి దారి చూపండి

మనుబోలు, జనవరి 25: శ్మశానానికి దారిచూపాలంటూ మండలంలోని జట్లకొండూరు దళితులు గురువారం తహసీల్దార్ బి శివకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా శ్మశానానికి దారిలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. శ్మశానం దారి స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆక్రమణలకు గురికాకుండా చూసి, దారి ఏర్పాటు చేయించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్‌వోను పంపి, విచారించి తగు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణపై అవగాహన

ముత్తుకూరు, జనవరి 25 : స్థానిక మత్స్య కళాశాలలో రెండు రోజుల పాటు 'బ్లెండెడ్ లెర్నింగ్ ప్లాట్‌ఫారం' (బీఎల్‌పీ) అనే అంశంపై ఎన్ఏహెచ్ఈపీ-ఐసీఏఆర్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్ఏహెచ్ఈపీ ప్రతినిధి మనీష్ టీచింగ్ ఫ్యాకల్టీ విద్యార్థినీ, విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ తదతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎఫ్‌యూ నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి సుగుణ, ఫిషరీ సైన్స్ డాక్టర్ డి రవీంద్రకుమార్‌రెడ్డి, ప్రొఫెసర్ కె ధనపాల్, యస్ మాధవన్, అనుపమ, మాధవి, జెసింత, చంద్రశేఖరరావు, ఆనంద్‌ప్రసాద్, వీరభద్రరావు, త్రివేణి, దీప్తి, మమత, శ్రీవిద్య, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి

ఆర్థిక వృద్ధికి మూలస్తంభం

వెంకటాచలం, జనవరి 25 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం డెవలప్మెంట్ డైలాగ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ - ఇంక్లుసివ్ ఎడ్యుకేషన్, ఇండస్ట్రీయల్ డెవలప్మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వీఎస్‌యూ వీసీ సుందరవల్లి, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ వీసీ కేసీ రెడ్డి విచ్చేసి మాట్లాడారు. పారిశ్రామిక అభివృద్ధి ఆర్థిక వృద్ధికి మూలస్తంభంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, సుజాఎస్ నాయర్, అందే ప్రసాద్, డాక్టర్ టీ వీరారెడ్డి, డాక్టర్ ఆర్ ప్రభాకర్, డాక్టర్ హుస్సేనయ్య, డాక్టర్ మేరీ సందీప్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సాయి స్రవంతి, డాక్టర్ కే సునీత, డాక్టర్ త్రివేణి, డాక్టర్ గాయత్రి అనుపమ ఉన్నారు.

పాఠశాలలకు కంప్యూటర్ల వితరణ

వెంకటాచలం, జనవరి 25 : మండలంలోని సర్వేపల్లి, నిడిగుంటపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు గురువారం రాష్ట్రపతి అవార్డు గ్రహీత దూర్జటి రాధాకృష్ణమూర్తి కంప్యూటర్లు వితరణ చేశారు. అలాగే పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్ విశాలక్ష్మి, పెరిసిన కోటేశ్వరరావు, పిడతల శ్రీధర్, మోదూరు శ్రీనివాసులు వివిధ రకాల వస్తు సామాగ్రిని వితరణ చేసినట్లు నిడిగుంటపాళెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చలపతి తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

పొదలకూరు, జనవరి 25 : పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్, పాత ఎస్సీ బాలికల హాస్టల్ (దాచూరు)లోని పదో తరగతి విద్యార్థులకు పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నం సుబ్బారావు దంపతులు పరీక్ష అట్టలు, స్కేలు, పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహారెడ్డి పాల్గొని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నం సుబ్బారావు, అయా హాస్టల్ వార్డెన్‌లు సీహెచ్ విద్యుల్లత, ప్రవీణా, ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయ సిబ్బంది పరమేశ్వర్, రజని, విజ్ఞాన్ కాలేజీ అకడమిక్ ఇన్‌చార్జ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

రంగడి ఆలయంలో సుదర్శన హోమం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 25 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం సుదర్శన హోమం ఘనంగా జరిగింది. నరసిం హ, గరుడ, ధన్వంతరి మహాయాగం కూడా నిర్వహించారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సుదర్శన హోమాన్ని వీక్షిస్తున్న భక్తులు

కమనీయం రంగనాథస్వామి కల్యాణం

ధర్మప్రచారంలో భాగంగా భక్తుల వద్దకు భగవంతుడు కార్యక్రమంలో గురువారం రాత్రి బాలాజీనగర్ సీతారామ మందిరంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి క ల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మునిసిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నెల్లూరు (విద్య), జనవరి 25 : మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని అర్బన్ విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటే శ్వరరావు మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించి ఉన్నత పాఠశాలల్లోని సెకండరీ గ్రేడ్ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై విజయవాడలో తలపెట్టిన ధర్నాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా అప్రజాస్వామికంగా అడ్డుకుందని విమర్శించారు. దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు వీవీ శేషులు, జీవీ చలపతిశర్మ, అసోసియేట్ అధ్యక్షుడు ఎంసీ అచ్చయ్య, కార్యదర్శులు ఎస్ మధుసూదన్‌రావు, నాగిరెడ్డి, ఖాజావలి, నరసింహులు పాల్గొన్నారు.

జీవీఆర్‌ఆర్ కళాశాలలో ఓటరు ప్రతిజ్ఞ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 25 : జాతీయ ఓటరు దినోత్సవాన్ని బాలభవన్ ఆధ్వర్యంలో జీవీఆర్‌ఆర్ కళాశాలలో నిర్వహించారు. ఉదయం 11గంటలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. యువత అంతా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసి, ప్రజాహిత ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పీ రామదండు, కేబీఆర్ స్కూలు కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు సురేష్ పాల్గొన్నారు.

25 వేల మందితో కదలివెళ్దాం

● కార్యకర్తలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 25 : టీడీపీ అధినేత చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 28వ తేదీన నగరంలో జరిగే రా... కదిలిరా..! సభకు నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 25 వేల మందితో కదలివెళ్దామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన లోకేష్ యువగళం పాదయాత్రలో నెల్లూరు రూరల్ బ్రాండ్ ముద్ర వేసుకుందన్నారు. అదేవిధంగా చంద్రబాబు సభలోనూ రూరల్ నియోజకవర్గం కచ్చితంగా ప్రత్యేకతను చాటాలని పిలుపునిచ్చారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, కొద్దిరోజుల్లో వారి మాట వినే అధికారి ఎవరూ ఉండరని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, రూరల్ నియోజకవర్గ పరిశీలకుడు గంటా గౌతమ్, రాజా నాయుడు పాల్గొన్నారు.

టీడీపీలోకి అబుబకర్

బారాషహీద్ దర్గా మాజీ చైర్మన్, 36వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి అబుబకర్ తన మిత్రబృందంతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. 24వ డివిజన్ వైసీపీ నేత గుంటూరు రామ్మోహన్ రెడ్డి కూడా టీడీపీలో చేరారు. కాగా, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కుటుంబీకులు 30వ డివిజన్ రాజీవ్ స్వగృహ, పోలీస్‌కాలనీ, టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు

నెల్లూరు రూరల్, జనవరి 25 : ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వారా ప్రజలకు, గ్రామాలకు పలు సేవలు అందుతాయని మండలంలోని సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కే కొండయ్య తెలిపారు. గురువారం గ్రామంలో విద్యార్థులు, స్థానికులతో సమావేశం నిర్వహించి ఎన్ఎస్ఎస్ క్యాంపులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొగళ్లపాళెం, కసుమలమిట్ట, శ్రీరామ కాలనీల్లో శిబిరాల ద్వారా సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. అనంతరం కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి విజయకుమార్ పాల్గొన్నారు.

వేదగిరీశుడి గిరిప్రదక్షిణ



నెల్లూరు రూరల్, జనవరి 25 : వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామికి గురువారం గిరి ప్రదక్షిణ ఉత్సవం నిర్వహించారు. పౌర్ణమి తిథి సందర్భంగా విశేష అభిషేకాలు, స్వామి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గరుడ వాహనంపై కొలువుదీర్చి ఊరేగింపుగా గిరిప్రదక్షిణ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈవో గిరికృష్ణ పర్యవేక్షించారు.

జ్ఞానం అందించేది శివానందలహరి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 25 : భక్తుని బుద్ధిని ప్రేరేపించి జ్ఞానం అందించడం తోపాటు ముక్తిని ప్రసాదించేది శివానందలహరి అని ఆధ్యాత్మికవేత్త గుడ్లదొన వరప్రసాద్ రావు తెలిపారు. పుష్య పౌర్ణమి, జగద్గురు ఆదిశంకరాచార్యులు శృంగేరిలో దక్షిణామ్నాయ శారదా పీఠం, బదరీనాథ్‌లో ఉత్తరామ్నాయ జ్యోషి మఠం స్థాపించిన పర్వదిన వేడుకలు పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో జరిగాయి. వరప్రసాదరావు శివానందలహరిపై ప్రవచించారు. ఆదిశంకరాచార్యులు శ్రీశైల క్షేత్రాన్ని దర్శించుకుని అక్కడి పాలధార, పంచధార ప్రాంతంలో శివానందలహరి రాశారని తెలిపారు. ఆత్మరూపంలో ఉన్న పరమశివుని స్మరించడమే నిజమైన ఆనందమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చక్రాల వారి ట్రస్ట్ కార్యదర్శి ఎం ఉదయకుమార్ శర్మ, ఎం లక్ష్మీనరసింహారావు శర్మ, శ్రీహరి ప్రసాదరావు శర్మ, మేనేజర్ సమయానంద స్వామి పాల్గొన్నారు.

వైసీపీ పాలన అరాచకం

● టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల

నెల్లూరు (వైద్యం), జనవరి 25 : రాష్ట్రంలో వైసీపీ పాలనంతా అరాచకమేనని తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర అధ్యక్షుడు మామిడాల మధు విమర్శించారు. గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పులివెందులలో ఓడిపోవ డం ఖాయమని జోస్యం చెప్పారు. టీడీపీ కార్యకర్తలు ఓటరు వెరిఫికేషన్ అడిగితే వైసీపీ గుండాలు దాడి చేయటం దారుణమన్నారు. అదే వైసీపీకి చెందిన వలంటీర్లు ఓటీపీ అడిగితే తప్పు కాదా అంటూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను ప్రశ్నించారు. అభివృద్ధి అంటే ఏమిటో మాజీ మంత్రి పొంగూరు నారాయణ చేసి చూపించారన్నారు. మరో మూడు నెలల్లో టీడీపీ ప్రభు త్వం వస్తుందని, చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉంటారని తెలిపారు.

ఎంపీని కలిసిన అంగన్‌వాడీలు

నెల్లూరు (వైద్యం), జనవరి 25 : రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గురువారం సాయంత్రం అంగన్‌వాడీలు నెల్లూరులోని ఆయన నివాసంలో కలిశారు. వేమిరెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టడంతో తమ సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు. శాలువా, పుష్పగుచ్ఛంతో ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

28న గంధ మహోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 25 : నగరంలోని 30వ డివిజన్ శ్రామికనగర్‌లో హజ్రత్ సయ్యద్ గౌస్ పీర్ షా ఖాదిరి రెండవ గంధ మహోత్సవం ఈనెల 28న జరుగుతుందని దర్గా కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 5గంటల నుంచి ఈ వేడుకలు జరుగుతాయని, గంధ మహోత్సవం అనంతరం ఫాతేహా ఖాని నిర్వహించి భక్తులకు ప్రసాదం పంచుతారని పేర్కొంది.

గ్రామీణుల కోసమే 'ఆడుదాం ఆంధ్రా'

పొదలకూరు, జనవరి 25 : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీల్లో విజేతలకు గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

● 'ఆసరా నిధుల పంపిణీ

ముత్తుకూరు : స్థానిక మండల కార్యాలయ ప్రాంగణంలో నాల్గవ విడత ఆసరా నిధులను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా పరిష్కరించడంలో తాను ముందుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుగుణ, ఎంపీడీవో లక్ష్మణ్‌కుమార్, తహసీల్దారు బాలకృష్ణారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, కాకుటూరు లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 25: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయం లో గురువారం లక్ష కుంకుమార్చన జరిగింది. 20మందికిపైగా అర్చకులు కార్యక్రమం లో పాల్గొన్నారు. లలితా సహస్ర నామాలతో చేసిన లక్ష కుంకుమార్చనలో ఉభయ దాతలుగా భక్తులు వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమాలు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 25 : పుష్యమాస పౌర్ణమి సందర్భంగా గురువారం మూలాపేట శంకరమఠం, పప్పులవీధి పాండురంగ స్వామి ఆలయాల్లో చండీ హోమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శంకరమఠంలో మేనేజర్ నంద కిషోర్ దంపతులు, పాండురంగ స్వామి ఆలయంలో శ్రీపీఠం వ్యవస్థాపకుడు శివయ్యస్వామి పర్యవేక్షించారు.

సత్యనారాయణ వ్రతాలు

పౌర్ణమి సందర్భంగా మహాత్మా గాంధీనగర్ కృష్ణ మందిరం, రాయాజీవీధి శివరామ కృష్ణ మందిరంలో సత్యనారాయణ వ్రతాలు భక్తిశ్రద్ధలతో సామూహికంగా జరిగాయి.


శివపార్వతుల కల్యాణం

ధర్మప్రచారంలో భాగంగా గురువారం మూలస్థానేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో మహేశ్వరి నగర్ డీఎస్ఎస్ కల్యాణ మండపంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న పోలంరెడ్డి

ఇందుకూరుపేట : లేబూరులో ఇటీవల మరణించిన టీడీపీ నాయకులకుటుంబ సభ్యులను గురువారం కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరామర్శించారు. మన్నెమత్తుల సిద్ధార్థ రెడ్డి, వేటగోపాలయ్య, పత్తిపాటి సీనయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రావిళ్ల వీరేంద్రచౌదరి, మోటిపల్లి శ్రీహరి, వరిగొండ సింధూరకృష్ణ పాల్గొన్నారు.



గురుకులంలో గణతంత్ర శిల్పం



కోట, జనవరి 25 : కోటలోని అంబేడ్కర్ గురుకులంలో గురువారం సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులచేత 75వ గణతంత్ర దినోత్సవ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు.స్వాతంత్ర్యపోరాటంలో ప్రముఖపాత్ర పోషించిన గాంధీ, నేతాజీ , నెహ్రూ చిత్రాలను ఇసుకతో మలిచారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన పెంపొందించే విధంగా ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు. గురుకులం ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు సైకత శిల్పి సనత్‌కుమార్‌ను అభినందించారు.

→ సైకతా శిల్పం వద్ద విద్యార్థులు

రిపబ్లిక్ డే ఏర్పాట్లు పూర్తి

● 300మందికి పైగా ఉద్యోగులకు నేడు పురస్కారాలు



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 25:గణతంత్ర దినోత్సవానికి తిరుపతిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ అందంగా ముస్తాబైంది.వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి 12స్టాళ్లను ఏర్పాటు చేశారు.గురువారం పోలీసు కవాతు రిహార్సల్స్‌ను ఎస్పీ పరమేశ్వరరెడ్డి నేతృత్వంలో నిర్వహించారు.జాతీయ పతాకం ఎగురవేసి జెండా వందనం స్వీకరించారు.డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనల రిహార్సల్స్ కూడా జరిగాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మువ్వన్నెల రంగుల విద్యుత్ కాంతులతో కలెక్టరేట్ భవనం ముస్తాబైంది.శుక్రవారం ఉదయం 9.10గంటలకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి జాతీయ పతాకం ఎగురవేశాక జిల్లా అభివృద్ధి గురించి మాట్లాడతారు. 7 ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన,బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 300మంది ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రశంసాపత్రాల పంపిణీ చేయనున్నారు.

→ మువ్వన్నెల విద్యుత్ కాంతుల్లో కలెక్టరేట్ ముస్తాబు

అడ్రసు....ఆంధ్రప్రదేశ్

● చంద్రగిరి ఓటర్ల జాబితాలో వింతలు ● కొనసాగుతున్న డబుల్ ఎంట్రీలు ● తుది జాబితాలోనూ తొలగించని తప్పులు

తహసిల్దారు నుంచీ కలెక్టర్ సహా రాష్ట్ర, కేంద్ర ఎన్నికల అధికారులకు భారీఎత్తున ఫిర్యాదులు... టీడీపీ నాయకుల ఆత్మాహుతి యత్నాలు... ఎన్నికల కమిషన్ హెచ్చరికలు... బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు.... ఇంత కసరత్తు జరిగినా తాజాగా విడుదలైన చంద్రగిరి నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాలో అవే తప్పులు పునరావృతమయ్యాయి.ఎక్కడా దిద్దుబాట్లు కనిపించక పోగా గత అక్టోబరు నుంచీ ఇటీవలి దాకా చేపట్టిన మార్పుచేర్పుల్లోనూ మరిన్ని తప్పిదాలు చోటు చేసుకున్నాయి. పలువురు ఓటర్లకు జారీ అయిన ఎపిక్ కార్డుల్లో వారి అడ్రసులే లేవు. డోర్ నంబరు అన్న కాలమ్ ఎదురుగా ఆంధ్రప్రదేశ్ అని పేర్కొని వుంది. ఇక డబుల్ ఎంట్రీల సంగతి సరేసరి. ప్రింటింగ్‌లో పొరబాట్లో లేక ఎంట్రీలో పొరబాట్లో గానీ జాబితా గందరగోళంగా మారింది.


- తిరుపతి, ఆంధ్రజ్యోతి



చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి అనేక మంది ఓటర్లకు ఎపిక్ కార్డుల్లో వారి చిరునామాలు గల్లంతయ్యాయి. చిరునామా అన్న చోట (ఇంటి నంబరు కాలమ్) ఆంధ్రప్రదేశ్ అని ముద్రించి వుంది. తిరుపతి రూరల్ మండలం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ పోలింగ్ స్టేషన్ నంబరు 349 పరిధిలో ఎక్కువగా ఈ పరిస్థితి కనిపించింది. ఉదాహరణకు ఈ ప్రాంతంలో ప్రకాష్‌రెడ్డి భార్య విజయలక్ష్మి (26)కి ఐఏఎక్స్ 3373776 నంబరుతో జారీ అయిన ఎపిక్ కార్డులో (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1010) ఇంటి నంబరు అన్న చోట ఆంధ్రప్రదేశ్ అని ముద్రించి వుంది. సుబ్రమణ్యం కుమారుడు శ్రీనివాసులు (41)కు చెందిన ఐఏఎక్స్ 3374907 నంబరుగల ఎపిక్ కార్డు (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1013)లోనూ ఇంటి నంబరు కాలమ్ ఎదుట ఆంధ్రప్రదేశ్ అని ముద్రించారు. ఐఏఎక్స్ 3374915 నంబరుతో (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1014) త్యాగరాజు భార్య రజని (44) పొందిన ఎపిక్ కార్డులోనూ ఇంటి నంబరు వుండాల్సిన చోట రాష్ట్రం పేరు ముద్రించారు. కొత్తగా నమోదు చేసుకున్న యువత విషయంలోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. ఉదాహరణకు షేక్ రఫీ కుమార్తె నసీమా (18)కు జారీ అయిన ఐఏఎక్స్ 3374931 నంబరు ఎపిక్ కార్డు (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1016)లోనూ ఇంటి నంబరు వద్ద ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. దావీదు కుమార్తె హెప్సీబా (18) పేరిట వచ్చిన ఐఏఎక్స్ 3369824 నంబరు ఎపిక్ కార్డు (ఓటరు జాబితా సీరియల్ నంబరు 1008)లోనూ అలానే పేర్కొన్నారు. మూడే సుబ్బరామ్ నాయక్ కుమార్తె శోభారాణి (25)కి ఐఏఎక్స్ 3374923 నంబరుతో (ఓటరు సీరియల్ నంబరు 1015) జారీ అయిన ఎపిక్ కార్డులో కూడా డోర్ నంబరు కాలమ్ ఎదుట ఆంధ్రప్రదేశ్ అని వుంది. ఇవన్నీ గతేడాది అక్టోబరు 27వ తేదీకి ఈ నెల 22వ తేదీకి నడుమ నమోదైన మార్పుచేర్పులు కావడం గమనార్హం.

భారీగా డబుల్ ఎంట్రీలు

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు భారీగా కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి తిరుపతి రూరల్ మండలంలోనే డబుల్ ఎంట్రీలు అధికంగా నమోదయ్యాయి. ఒకే ఎపిక్ కార్డుతో అటు చంద్రగిరి నియోజకవర్గంలో ఇటు తిరుపతి నియోజకవర్గంలో రెండు చోట్లా ఓటరుగా నమోదైన వ్యక్తులు పలువురు కనిపిస్తున్నారు. ఉదాహరణకు తిరుపతి రూరల్ మండలం సప్తగిరి కాలనీకి చెందిన ముక్కంటి బాలకృష్ణ భార్య ముక్కంటి పావని (38)కి పోలింగ్ కేంద్రం 349లో ఓటరు సీరియల్ నంబరు 1071, ఏవైఎం 1241793 నంబరుతో ఎపిక్ కార్డు వుంది. ఈమె పేరు గతేడాది డిసెంబరు 24న అప్‌డేట్ చేసినట్టు జాబితాలో పేర్కొన్నారు. అయితే పావని అదే ఎపిక్ కార్డు నంబరుతో తిరుపతి నియోజవకర్గం పోలింగ్ కేంద్రం నంబరు 211 (సత్యనారాయణపురం)లో సీరియల్ నంబరు 490తో ఓటరుగా నమోదై వున్నారు. ఈ వివరాలు గతేడాది డిసెంబరు 9న అప్‌డేట్ అయ్యాయి. కొత్త ఓటరు జాబితాలో రెండు చోట్లా పావని ఓటరుగా కొనసాగుతున్నారు. చంద్రగిరి సెగ్మెంట్ సప్తగిరి కాలనీలో పోలింగ్ కేంద్రం 349కి చెందిన సుబ్రమణ్యం కుమారుడు పి.నాగరాజు (62) ఏవైఎం 1351014 నంబరు ఎపిక్ కార్డు, సీరియల్ నంబరు 1081లతో ఈనెల 13న ఓటరుగా నమోదయ్యారు. ఆయన అదే ఎపిక్ నంబరుతో తిరుపతి నియోజకవర్గం పోలింగ్ కేంద్రం నంబరు 182 (కొత్తపల్లి)లో కూడా సీరియల్ నంబరు 743తో ఓటరుగా నమోదై వున్నారు. గతేడాది డిసెంబరు 9న ఓటరుగా ఈయన వివరాలను జాబితాలో అప్‌డేట్ చేశారు. చంద్రగిరి సెగ్మెంట్ పోలింగ్ కేంద్రం 349లోనే బి.సుబ్బారెడ్డి భార్య శ్యామల (30) ఏవైఎం2012458 ఎపిక్ కార్డు నంబరు, ఓటరు సీరియల్ నంబరు 1072లతో ఓటరుగా వున్నారు. ఈ ఎపిక్ కార్డు నంబరుతోనే మళ్ళీ తిరుపతి నియోజకవర్గం పోలింగ్ కేంద్రం నంబరు 105లో కూడా సీరియల్ నంబరు 308తో రైల్వే కాలనీలో ఓటరుగా నమోదై వున్నారు. గత డిసెంబరు 9న ఈ వివరాలు జాబితాలో అప్‌డేట్ అయ్యాయి. చంద్రగిరి సెగ్మెంట్ పోలింగ్ కేంద్రం 349 పరిధిలోనే కొండయ్య కుమారుడు బోదనపు నరేష్ (33) ఏవైఎం 3335817 ఎపిక్ కార్డు నంబరు, సీరియల్ నంబరు 1000లతో ఓటరుగా వున్నారు. గత డిసెంబరు 9న జాబితాలో వివరాలు అప్‌డేట్ అయ్యాయి. అయితే ఇదే ఎపిక్ నంబరుతో తిరుపతి నియోజవకర్గం 267వ నంబరు పోలింగ్ కేంద్రం (ఎల్ఎస్ నగర్) లో కూడా సీరియల్ నంబరు 2తో ఓటరుగా నమోదై వున్నారు. గతేడాది డిసెంబరు 9న వివరాలు అప్‌డేట్ అయ్యాయి.



పావనికి రెండుచోట్ల ఓటు

తప్పుల తడకగా ఓటర్ల జాబితా



చంద్రగిరి సెగ్మెంట్ పరిధిలో ఓటర్ల జాబితా తప్పుల తడకగా కనిపిస్తోంది. ఎపిక్ కార్డు ఐఏఎక్స్ 3374899 నంబరు, (సీరియల్ నంబరు 1012)తో రజాక్ సాహెబ్ కుమార్తె మెహరీన్ (24) పేరు ఓటర్ల జాబితాలో నమోదైంది. అయితే జాబితాలో మెహరీన్ అన్న పేరును పరిశీలిస్తే పేరులో సగం అంటే మెహ అన్నది తెలుగులో వుండగా మిగిలిన రీన్ అన్న అక్షరాలు హిందీలో ముద్రించారు. ఇక తండ్రి రజాక్ పేరు తెలుగులో వుండగా ఇనిషియల్ మాత్రం హిందీలో ముద్రించారు. యధాప్రకారం డోర్ నంబరు అన్న కాలమ్ ఎదుట ఆంధ్రప్రదేశ్ అని వుంది.

ఒకే పోలింగ్ కేంద్రంలో మహిళకు రెండు ఓట్లు



తిరుపతి రూరల్ మండలం సప్తగిరి కాలనీ పోలింగ్ కేంద్రం 349 పరిధిలో 12-174 ఇంటి నంబరులో వున్న జి.శేఖర్ భార్య జి.ప్రతిమ (47)కు ఓటరు జాబితా సీరియల్ నంబరు 513, ఏవైఎం 0560490 నంబరుతో ఎపిక్ కార్డు జారీ అయింది. అయితే అదే ఎపిక్ కార్డు నంబరు, అదే అడ్రసుతో, అదే పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితా సీరియల్ నంబరు 999తో మరో ఎపిక్ కార్డు కూడా జారీ అయింది. అంటే ఒకే ఎపిక్ కార్డు నంబరుతో ఆమె ఓటరు జాబితాలో రెండు చోట్ల నమోదయ్యారు. అది కూడా ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఇలా జరగడం చాలా విడ్డూరంగా కనిపిస్తోంది.

ఒకే ఇల్లు.... ఎన్ని తప్పులో



సప్తగిరి కాలనీలో 12-78 నంబరు గల ఇంటిలో జి.శ్రీనివాసులు, రుక్మిణి దంపతులు నివాసముంటున్నారు. అది వారి సొంతిల్లు. శ్రీనివాసులు ఎంజెడ్‌టీ3570843 ఎపిక్ కార్డు నంబరుతో 335 పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబరు 1057తో ఓటరుగా వున్నారు. ఆయన భార్య రుక్మిణి ఎంజెడ్‌టీ3570819 ఎపిక్ కార్డుతో 335వ నంబరు పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితా సీరియల్ నంబరు 1056తో ఓటరుగా వున్నారు. వీరి డోర్ నంబరు 12-78 పాతది కాగా ఇపుడు కొత్తగా 8-71 కేటాయించారు. వీరిద్దరి ఎపిక్ కార్డుల్లో పాత నంబరూ, కొత్త నంబరూ రెండు కాకుండా 8-74 అని ముద్రించి వుంది. ఇదో గందరగోళమైతే వీరి పాత డోర్ నంబరుతో మరో ఇద్దరి పేర్లు ఓటర్ల జాబితాలో నమోదయ్యాయి. ఏమా సీతారామిరెడ్డి కుమారుడు కుమార్‌రెడ్డి (36) ఎపిక్ కార్డు నంబరు ఐఏఎక్స్ 3399193, ఓటరు సీరియల్ నంబరు 1054తో ఓటరుగా వున్నారు. అలాగే కుమార్‌రెడ్డి భార్య ఏమా నాగమణి (32) సీరియల్ నంబరు 1053,ఎపిక్ నంబరు ఐఏఎక్స్3399185లతో ఓటరుగా నమోదయ్యారు. ఆ డోర్ నంబరులో యజమానులైన శ్రీనివాసులు, రుక్మిణి నివాసముంటున్నారు. ఆరా తీసేందుకు కుమార్‌రెడ్డికి ఫోన్ చేయగా స్పష్టంగా సమాధానమివ్వకుండా పెట్టేశారు.ఇలా చెప్పుకుంటూ పోతే చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల జాబితాలో కనిపిస్తున్న తప్పిదాలు, వింతలూ, విడ్డూరాలకు అంతూపొంతూ లేదనే చెప్పాలి. అయితే అవి పొరపాటున జరిగినవా లేక ఉద్దేశపూర్వకంగా చేసినవా అన్నదే కీలకం కానుంది. ఇదివరకే ఎన్నికల కమిషన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన నేపధ్యంలో ఇపుడు మళ్ళీ ఆధారాలతో ఎవరైనా ఫిర్యాదులు చేస్తే బాధ్యులైన ఉద్యోగులు, అధికారులపై తీవ్ర చర్యలు తీసుకునే అవకాశముంది.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా



బలిజపల్లె నుంచి హరిజనవాడకు వెళ్లిన ఓటర్లు

భాకరాపేట, జనవరి 25 : తుది ఓటర్ల జాబితాలోనూ ముసాయిదా ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పులను సవరించకుండా అలాగే వుంచేశారు. మృతులు, డబుల్ ఎంట్రీలు, వలస వెళ్లిపోయిన వారి ఓట్లు తాజా జాబితాలో అలాగే ఉన్నాయి. చిన్నగొట్టిగల్లు మండలంలోని పోలింగ్ కేంద్రం 42లో భాకరాపేట బీసీ కాలనీ, బలిజపల్లె, నీరుగట్టు హరిజనవాడ, నారాయణ స్వామి కాలనీలు ఉన్నాయి. తాజా ఓటరు జాబితాలో సీరియల్ నెంబరు 388 నుంచి 417 వరకు ఉన్న ఓట్లు బలిజపల్లెకు చెందినవి.వీరందరివి నీరుగట్టు హరిజనవాడ సెక్షన్లో చేరిపోయాయి.అలాగే సీరియల్ నెంబరు 974 నుంచి 982 వరకు ఉన్న ఓటర్లు నారాయణస్వామి కాలనీకి చెందిన వారు. వీరి పేర్లు బీసీ కాలనీ జాబితాలోకి వెళ్లిపోయాయి.



నారాయణస్వామి కాలనీ నుంచి బీసీ కాలనీకి వెళ్లిన ఓటర్ల జాబితా

ఎంపీ గురుమూర్తికి ఆదిలోనే అసమ్మతి సెగ

● వైసీపీ మండల కన్వీనర్ రాకతో సమావేశాన్ని బహిష్కరించిన ఒక వర్గం ● పార్టీ సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ/తిరుపతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సత్యవేడు వైసీపీ ఇంచార్జిగా నియోజకవర్గంలో అడుగుపెట్టారో లేదో అసమ్మతి సెగ తాకింది. ఇటీవల సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిగా గురుమూర్తిని వైసీపీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే.రానున్న ఎన్నికల్లో సత్యవేడు నుంచీ పోటీ చేయనున్న నేపథ్యంలో పర్యటనలకు ఎంపీ గురుమూర్తి శ్రీకారం చుట్టారు. సత్యవేడు సెగ్మెంట్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన శ్రేణులనూ ఈనెల 27న తిరుపతికి ఆహ్వానించి మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు.మంత్రి ద్వారా తనకు సహకరించి గెలుపుకోసం పనిచేయాలంటూ శ్రేణులకు దిశా నిర్దేశం చేయించేలా కార్యక్రమం రూపొందించుకున్నారు. అందులో భాగంగా మండలాల వారీగా ఆహ్వానించే పనిలో భాగంగా గురువారం బీఎన్ కండ్రిగకు వెళ్ళారు. అక్కడ సమావేశానికి మండల కన్వీనర్ విద్యానాధరెడ్డి హాజరు కాలేదు. ఎమ్మెల్యే ఆదిమూలం అనుచరుడైన ఆయన రాకపోవడంతో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం చొరవ తీసుకుని ఎంపీకి భారీసంఖ్యలో స్వాగతం పలికారు. అయితే సమావేశం ప్రారంభమయ్యే సమయంలో మండల కన్వీనర్‌ను కూడా ఆహ్వానిస్తే బాగుంటుందని కొందరు సూచించడంతో ఎంపీ కన్వీనర్ ఇంటికి వెళ్ళి వెంట బెట్టుకుని తిరిగివచ్చారు. దీంతో అప్పటి వరకూ ఎంపీని నెత్తిన పెట్టుకున్న ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు ఒక్కసారిగా రివర్స్ య్యారు. కన్వీనర్ సమావేశానికి రాకపోగా తామంతా ముందుండి స్వాగత సత్కారాలు చేస్తే సమావేశానికి రాని కన్వీనర్ ఇంటికి ఎంపీ వెళ్ళి పిల్చుకురావడమేమిటని మండిపడ్డారు.సింగిల్‌విండో ఛైర్మన్ హరినాథరెడ్డి, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, గురునాథం, గురవయ్యలతో పాటుగా పదుల సంఖ్యలో నాయకులు, వారి అనుచరులు అక్కడినుంచి వెళ్ళిపోయారు. ఎంపీ అనుచరులు వచ్చి ఎంత సముదాయించినా సమావేశానికి రాకపోవడంతో అరగంట తరువాత కన్వీనర్‌తో కలసి వున్న కొద్దిమందితోనే ఎంపీ సమావేశం నిర్వహించి తిరుపతి మీటింగుకు రావాలని అభ్యర్థించి వెళ్ళిపోయారు.ఎంపీపీ సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ మునికృష్ణా రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ బాలాజీరెడ్డి, వైసీపీ జిల్లా కార్మిక విభాగ అధ్యక్షుడు బీరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.



అసమ్మతి నాయకులను సముదాయిస్తున్న ఎంపీ అనుచరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

మండల పరిషత్ మీటింగ్ హాల్లో సమావేశమా?

ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రమే వేదిక కావాల్సిన బీఎన్ కండ్రిగ మండల పరిషత్ కార్యాలయ మీటింగు హాలు గురువారం వైసీపీ కార్యకర్తల సమావేశానికి వేదికగా మారింది.ఎంపీ గురుమూర్తి అక్కడ పార్టీ అభివృద్ధి, ఐక్యత గురించి ప్రసంగించారు. ప్రభుత్వ కార్యాలయంలో అధికార పార్టీ సమావేశం ఏర్పాటు చేయడం, ఎంపీడీవో సాయి లహరి కూడా ఈ సమావేశంలో పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

రోడ్డుప్రమాదంలో అత్తాకోడళ్ల మృతి



మృతులు లీలారాణి, విజయఅను (ఫైల్ ఫొటోలు)

పిచ్చాటూరు, జనవరి 25 : రోడ్డు ప్రమాదంలో అత్తాకోడళ్ల మృతి చెందడం బాధిత కుటుంబంతో పాటు పిచ్చాటూరు వాసులను విషాదానికిలోనుచేసింది. పిచ్చాటూరుకు చెందిన బుక్ స్టోర్ యజమాని ఉమాశంకర్ గుప్త అలియాస్ శంకర్‌శెట్టి భార్య ఎ.లీలారాణి,చిన్న కుమారుడు వినోద్, కోడలు విజయ అను,మనవళ్ళతో కలసి గురువారం ఉదయం కంచి మీనాక్షి గుడికి వెళ్లారు.దర్శనానంతరం అక్కడినుంచి బెంగళూరుకు కారులో బయల్దేరారు. మార్గమధ్యంలోని రాయవేలూరుకు 10 కి.మీ ముందు కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది.ఈ ప్రమాదంలో లీలారాణి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ మిగిలిన వారిని చికిత్స నిమిత్తం వేలూరు నరువ్వ ఆస్పత్రికి తరలించారు. విజయఅను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.శంకర్‌శెట్టి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుండగా వినోద్‌కు చేయి విరిగినట్లు సమాచారం. పిల్లలు ఇద్దరూ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పిచ్చాటూరులో సుమారు 40 ఏళ్లగా బుక్‌స్టోర్ నడుపుతూ స్థానికంగా అందరికీ చిరపరిచితుడైన శంకర్‌శెట్టి కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల స్థానిక వ్యాపార సంఘం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.

దళితులను వేధించడమే జగన్ లక్ష్యం

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్


మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

తడ, జనవరి 25: దళితులను వేధించడమే జగన్ లక్ష్యమని కేంద్ర కేంద్ర మంత్రి చింతా మోహన్ విమర్శించారు. గురువారం తడ పంచాయతీ సెల్వకుప్పం, నడిమికుప్పం గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీప్రభుత్వం పూర్తిగా దళిత వ్యతిరేక ప్రభుత్వమని చెప్పారు. కోడికత్తి డ్రామాలాడి ఓ దళిత యువకుడిని ఐదేళ్లుగా జైల్లో నిర్బంధించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోతుందని అందుకే ఇప్పటి నుంచే తాను దిగిపోతానంటూ పరోక్షంగా ఓటమిని జగన్ ఒప్పుకుంటున్నాడన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజేంద్రనాయుడు, బాలాజి, సింధూజ, వెంకటకృష్ణయ్య, చందనమూడి శివ పాల్గొన్నారు.

రోజా మృతదేహానికి పంచనామా


రోజా మృతదేహాన్ని బయటకు తీస్తున్న అధికారులు

వెంకటగిరి, జనవరి 25: తమ బిడ్డను అల్లుడే చంపేశాడని పట్టణ పరిధిలోని 14వ వార్డు ధర్మాపురానికి చెందిన పరమాల రోజా తల్లిదండ్రులు సుశీలమ్మ, పెంచలయ్యలు ఈనెల 22వ తేదీన పోలీసుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఫిర్యాదు మేరకు డక్కిలి తహసీల్దారు రమేష్‌బాబు, ఎస్‌ఐ నరసింహారావు సమక్షంలో మరాటపల్లి శ్మశాన వాటికలో పూడ్చిపెట్టిన రోజా మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు సాయి, వసుంధలు పంచనామా నిర్వహించి.. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలిపీ నమూనాలను ఎస్‌ఐకి అప్పగించారు.

అంబేడ్కర్‌కు నివాళి



నాయుడుపేట, జనవరి 25: పాతబస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి దోబీ సంఘం జాతీయ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతి నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్న మహాపాదయాత్ర గురువారం నాయుడుపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సమస్యల సాధనే లక్ష్యంగా తిరుపతి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రజక సంఘం నేతలు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గణతంత్ర దిన వేడుకలకు ఏర్పాట్లు

గూడూరు, జనవరి 25: సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం నిర్వహించనున్న గణతంత్ర దిన వేడుకలకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఏర్పాట్లను తహసీల్దారు లీలారాణి పరిశీలించారు. ఆర్డీవో ఆధ్వర్యంలో జరగనున్న వేడుకల్లో ప్రజలు, విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలి

గూడూరు, జనవరి 25: వాహనదారులు నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడిపితే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ఎంవీఐ సునీల్ అన్నారు. గురువారం టవర్‌క్లాక్ సెంటర్ వద్ద రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఆటోడ్రైవర్లకు రోజాపూలు అందజేసి, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలీస్, రవాణశాఖసిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

చిల్లకూరు, జనవరి 25: విద్యార్థులు చదువులతోపాటూ క్రీడల్లోనూ రాణించాలని ఇంటర్నేషనల్ పారా ఒలంపిక్ 100 గోల్డ్‌మెడలిస్ట్ మామిడి లక్ష్మయ్య, ఎల్‌ఏపీ పాఠశాల కరస్పాండెంట్ బస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఎల్‌ఏపీ పాఠశాలలో 39వ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. ఓంనమఃశివాయ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పెళ్లకూరు, జనవరి 25: పాలచ్చూరు, అనకవోలు, చెంబేడు, నందిమాల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దుల నరేంద్రరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో మించల శంకరయ్య, ఏవో గొడవర్తి ప్రవీణ, పెళ్లూరు అనిల్ కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంధవల్లి వసంతకుమార్, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు,

తడ: తడ కండ్రిగ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. సర్పంచ్ జయప్రదశశికుమార్, ఎంపీడీవో ఆమోస్‌బాబు, ఈవోపీఆర్‌డీ జయకుమార్, బీజేపీనేతలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం

- శాసించే స్థాయికి ఎదిగారు : నరసింహయాదవ్, పాశం


బీసీ సదస్సులో ఐక్యతను చాటుతున్న టీడీపీ నేతలు

చిట్టమూరు, జనవరి 25: టీడీపీ హయాంలోనే బీసీలకు సముచితం స్థానం ఉండేదని.. రాజకీయాలు నేర్చుకుని, శాసించే స్థాయికి ఎదిగారని తిరుపతి పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ సదస్సును మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు, బీసీసెల్ అధ్యక్షుడు చెంచురామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి బీసీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 56 కార్పొరేషన్లు అంటూ సీఎం జగన్.. బీసీలను ప్రలోభాలకు గురిచేసి ఒక్క కార్పొరేషన్‌కు కూడా ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఏ సమావేశంలోనైనా చంద్రబాబు పక్కన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల నేతలే కనిపిస్తారని చెప్పారు. అదే వైసీపీ ప్రభుత్వంలో మాత్రం ఈ వర్గాలకు స్థానం లేకుండా చేశారన్నారు. గూడూరుకు ఒకాయన చెన్నై నుంచి వచ్చి ఎమ్మెల్యే అయి ప్రజలను, సమస్యలను గాలికి వదిలేస్తే.. ఇపుడు రాపూరు నుంచి మరోకాయన అన్నీ సర్దుకు పోయేందుకు వస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని జగన్‌కు అర్థమైందని, అందుకే సంతోషంగా దిగిపోతానని తిరుపతిలో ఒప్పుకున్నారన్నారు. నాయకులు బిల్లు చెంచురామయ్య, రుద్రకోట సదాశివం, కస్తూరయ్య, తీగల సురేష్, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, బాలకృష్ణయాదవ్, చేజర్ల మనోహర్, మునస్వామి, రషీద్, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన వైసీపీ: నెలవల


నెలవల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

సూళ్లూరుపేట, జనవరి 25: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలను మోసం చేసిందని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో నెలవల సమక్షంలో దొరవారిసత్రం మండలం నెమలిమిట్ట అగ్రహారానికి చెందిన వైసీపీకి చెందిన సమాది సుబ్రమణ్యం యాదవ్, నెలవల శ్రీనివాసుల యాదవ్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వైసీపీకి చెందిన బీసీ నాయకులందరూ టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని నెలవల చెప్పారు. తమ అధినేత చంద్రబాబు ఆదేశాలతో అందరినీ కలుపుకుని నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. ఈ కకార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నాయకులు బొమ్మన్ పళణి, మొలచాం సుదర్శన్ రావు, పూడి శెల్వం, ఏజీ కిషోర్, వెంకటేశ్వర్లు, సంచి కృష్ణయ్య, భాస్కర్, జయపాల్, టీకే రవి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : కురుగొండ్ల


సదస్సులో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, జనవరి 25: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, బిడ్డల భవిష్యత్తు బాగుండాలన్నా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం బాలాయపల్లిలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జిల్లా నాయకుడు రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్లను సీఎం జగన్ నిర్వీర్యం చేశారని ఆగ్రహించారు. బీసీల నిధులనూ పక్కదారి పట్టించారని చెప్పారు. కురుగొండ్ల మాట్లాడుతూ.. బీసీలకు గుర్తింపు ఇచ్చింది టీడీపీయేనన్నారు. నాయకులు గంగోటి నాగేశ్వరరావు, రాయి మస్తాన్‌నాయుడు, మునుస్వామి, రాయి సత్యంనాయుడు, దాసరి రాజగోపాల్‌నాయుడు, కూను శ్రీహరి, దాసరి ప్రభాకర్‌నాయుడు, కొర్రపాటి రామచంద్రయ్యనాయుడు, వెంకటాద్రి, సీసీనాయుడు, మద్దూరు కృష్ణ, ప్రసన్నకుమార్, సీవీకేనాయుడు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ కోసం జాతీయ రహదారి దిగ్బంధం

- రాజకీయ పార్టీలకతీతంగా పెసల గుర్రప్పతోట వద్ద నిరసన
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- ఇబ్బంది పడ్డ ప్రయాణికులు



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ప్రజలు - బారులు తీరిన వాహనాలు

పెళ్లకూరు, జనవరి 25: అండర్ పాస్ కోసం పెళ్లకూరు మండలంలోని పెసల గుర్రప్పతోట వద్ద జాతీయ రహదారిని గురువారం స్థానికులు దిగ్బంధించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పెసల గుర్రప్పతోట వద్ద 20 గ్రామాలకు, సెజ్‌లకు వెళ్లే రహదారి సౌకర్యం కనుమరుగైంది. కొంతకాలంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులతోపాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ తదితర ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరినా ఫలితం కానరాలేదు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు రాజకీయ పార్టీలకతీతంగా స్థానిక నేతలతో కలసి గురువారం ఉదయం తొమ్మిది గంటలకు మూకుమ్మడిగా పెసల గుర్రప్పతోట వద్ద జాతీయరహదారిని దిగ్బంధించారు. సుమారు గంటకుపైగా రాస్తారోకో చేపట్టడంతో ఇరువైపులా వాహన రాకపోకలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా తదితరులు కూడా వీరికి మద్దతు తెలిపారు. కామిరెడ్డి మాట్లాడుతూ.. 20 గ్రామాలతోపాటు సమీపంలో ఉన్న సెజ్‌ల రాకపోకలకు అనుకూలంగా అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కోరినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. ఇక్కడి ప్రజల బాధను చూసి అయినా అండర్ పాస్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పాలచ్చూరు సర్పంచు పెళ్లూరు షర్మిలారెడ్డి మాట్లాడుతూ.. తమగోడును ప్రభుత్వం పట్టించుకుని ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం అండర్ పాస్ ఏర్పాటు చేయాలని, లేకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెళ్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కాటంరెడ్డి రామలింగారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, మద్దాల కీర్తిరెడ్డి, దువ్వూరు సతీష్‌రెడ్డి, గుండాల సురేష్‌రెడ్డి, పగడాల హరిబాబు, యాళ్ల సుధాకర్‌నాయుడు, వేములయ్య, రాజయ్య, టీడీపీ నాయకులు మాడుపూరు మురళీనాయుడు, అక్కరపల్లి రవీంద్రరెడ్డి, చలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు,

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం



సూళ్లూరుపేట, జనవరి 25: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో పౌర్ణమి పర్వదినం సందర్భంగా గురువారం మహా చండీయాగం వైభవంగా నిర్వహించారు. కళత్తూరు రామ్మోహన్ రెడ్డి, పాలక మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి, బండి సునీత తదితరులు పాల్గొన్నారు.

కచ్చేరి వీధిలో రోడ్డు విస్తరణకు శ్రీకారం



సూళ్లూరుపేట, జనవరి 25: సూళ్లూరుపేట పట్టణంలోని కచ్చేరివీధి విస్తరణ చేసేందుకు మున్సిపాలిటీ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం రెండువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రారంభించారు. దాదాపు 500 మీటర్ల పొడవు సీసీ రోడ్డుతోపాటు రెండు వైపులా కాలువలు నిర్మించనున్నారు. రూ.38 లక్షలతో కాలువలు, సీసీ రోడ్డుకు రూ.58లక్షలు కేటాయించి అభివృద్ధి పనులు చేయనున్నట్లు కమిషనర్ నాగేంద్ర తెలిపారు. పట్టణ ప్రజలందరూ ఇందుకు సహకరించాలని కోరారు.

28న సాధికార బస్సు యాత్ర: ఎమ్మెల్సీలు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు బల్లి, మేరిగ

కోట, జనవరి 25: కోట పట్టణంలో ఈనెల 28వ తేదీన వైసీపీ సాధికార బస్సు యాత్ర జరగనుందని ఎమ్మెల్సీలు మేరిగ మురళి, బల్లి కళ్యాణ చక్రవర్తి తెలిపారు. కోటలో వారు గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ● అల్లంపాడులో వైసీపీ కార్యకర్తలతో మేరిగ మురళి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు సంపత్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి, పాదర్తి రాధాకృష్ణారెడ్డి, ప్రసాద్‌గౌడ్, పల్లమాల రమణయ్య, షనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఐల బాధ్యతల స్వీకరణ

గూడూరు/నాయుడుపేట టౌన్, జనవరి 25: గూడూరు ఒకటోపట్టణ సీఐగా పాపారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా త్రిపురాంతం సర్కిల్ నుంచి గూడూరుకు బదిలీపై వచ్చారు. అలాగే నాయుడుపేట అర్బన్ సీఐగా శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశంజిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

రైతుబజారు నూతన కార్యవర్గం

గూడూరు, జనవరి 25: రైతుబజారులో గురువారం రైతుబజారు అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా ఖాదర్‌బాషా, కార్యదర్శిగా శ్రీనివాసులు, సహాయకార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా ప్రమీలతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

400 సెల్‌ఫోన్ల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25 : ప్రజలు పోగొట్టుకున్న, చోరీకి గురైన 400 సెల్‌ఫోన్లను రివకరీ చేసినట్టు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.72 లక్షలు ఉంటుందని చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. సెల్‌ఫోన్ల చోరీకి సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై తిరుపతి సైబర్ సెల్ సీఐ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణుల బృందం అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందన్నారు. అనంతరం కొందరు బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో 'నవావరణ' పూజలు



గూడూరు, జనవరి 25: సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవీ ఉపపీఠంలో గురువారం అమ్మవారికి వంహానవావరణ హోమం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. పౌర్ణమి తిథిని పురస్కరించుకుని అమ్మవారికి హోమ పూజలను నిర్వహించామన్నారు.

వెలుగు ఉద్యోగుల సమ్మెతో 'ఆసరా' వాయిదా

వాకాడు, జనవరి 25: మండలంలో గురువారం జరగాల్సిన జగనన్న ఆసరా 4వ విడత కార్యక్రమం వెలుగు ఉద్యోగుల సమ్మెతో వాయిదా పడిందని ఎంపీడీవో గోపీనాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వెలుగు సీసీలు సమ్మెబాట పట్టడంతో వీవోఏలు కూడా సహకరించకపోవడంతో పొదుపు సంఘాల మహిళలు రాకపోవడంతో కార్యక్రమం వాయిదా పడిందన్నారు. తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

క్రికెట్ విజేత వాకాడు జట్టు

గూడూరు, జనవరి 25: ఏపిరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరుగుతున్న ఆడుదాం-ఆంధ్రా నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో గురువారం వాకాడు మండలం నెల్లిపూడి సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. గూడూరు, వాకాడు ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, గోపీనాథ్, శివకుమార్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, కరీముల్లా పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కోట, జనవరి 25 : పుచ్చలపల్లిలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో దారా మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరుపట్టీని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

విశిష్ట సేవలకు పురస్కారం


కృష్ణప్రసాద్ దంపతులకు అభినందన

కోట, జనవరి 25: గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించిన కోట మండలం సిద్ధవరం గ్రామానికి చెందిన వాకాని కృష్ణప్రసాద్ ఆచార్యులకు సహరా చారిటబుల్ ట్రస్టు వారు స్వామి వివేకానంద సేవారత్న పురస్కారాన్ని అందించారు. గురువారం రాత్రి నెల్లూరులోని పడారుపల్లి చెన్నకేశవ కళ్యాణమండపంలో ఈఅవార్డును ప్రదానం చేశారు. గ్రామీణ వైద్యుడిగా, అర్చకుడిగా కృష్ణప్రసాద్ చేసిన సేవలకు ఈగుర్తింపు ఇవ్వడం జరిగిందన్నారు. జాతీయవినియోగదారులహక్కుల కమిషన్ ఏపీ సంయుక్త కార్యదర్శి విజయకుమార్, రాష్ట్ర పరిశీలకుడు తిరుమలశెట్టి కోటేశ్వరరావు ద్వారా ఈ అవార్డును అందుకున్నారు.


రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ మృతి


లక్ష్మీపతినాయుడు (ఫైల్ ఫొటో)

పుత్తూరు అర్బన్, జనవరి 25: రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ మృతి చెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ లక్ష్మీపతినాయుడు (68), తన భార్య లక్ష్మీకాంతమ్మతో కలిసి వేపగుంట క్రాస్ వద్ద ఉన్న ఆస్పత్రికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోకి వెళ్లడానికి వీలుగా రోడ్డు క్రాస్ చేసేందుకు ఎడమ వైపు వాహనాన్ని నిలిపారు. ఈ సమయంలో నగరి నుంచి పుత్తూరు వైపు వస్తున్న లగేజ్ వ్యాను వీరిని వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీపతినాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య లక్ష్మీకాంతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు.. బాధితురాలిని వైద్యం కోసం తిరుపతిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీపతినాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, లక్ష్మీపతినాయుడు ప్రస్తుతం పరమేశ్వరమంగళం పంచాయతీ వార్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు.

ఓటు.. వజ్రాయుధం


గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించిన అధికారులు

సూళ్లూరుపేటలో సీనియర్ ఓటర్లను సన్మానించి, ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు - తడకండ్రిగ పాఠశాలలో సీనియర్, జూనియర్ ఓటర్లకు సన్మానం

గూడూరు, జనవరి 25: ఓటు.. వజ్రాయుధం వంటిదని తహసీల్దారు లీలారాణి అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సబ్‌కలెక్టరేట్ నుంచి విద్యార్థులతో కలిసి టవర్‌క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవో శివప్రకాష్‌రెడ్డి, కాంచన పాల్గొన్నారు.

డక్కిలి: తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లను తహసీల్దార్ రమేష్ బాబు సత్కరించారు. అలాగే బీఎల్వోలను అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓటు విలువను తెలియజేశారు. డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, ఆర్‌ఐలు రాజేష్, ప్రసన్న, సర్వేయర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు రాజేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గురువయ్య, ఎంఈవో-2 మునిరత్నం, మున్సిపాలిటీ మేనేజర్ మహ్మద్‌ఖాదర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఆకుతోట వీధిలోని మహిళలకు విశ్రాంత ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంఘం నాయకులు పీడీ ఉదయశంకర్, పేర్నాటి వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, పద్మనాభం, శశిధర్, రవిబాబు, ప్రమీలమ్మ, జయమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: తహసీల్దారు కార్యాలయం వద్ద మహిళలకు ముగ్గులు పోటీలను నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఆర్‌ఐ రమ్య, వీఆర్‌వోలు రమణయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓజిలి: తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు శివరామసుబ్బయ్య ఆధ్వర్యంలో ఓజిలిలోని సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఆర్‌ఐ విజకుమార్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, ఓటర్లు పాల్గొన్నారు.

కోట: తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ముగ్గురు సీనియర్ ఓటర్లను సన్మానించారు. తహసీల్దారు పద్మావతి, డిప్యూటీ తహసీల్దారు అల్లం మల్లికార్జున్‌రావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెళ్లకూరు: తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లకు సన్మానించారు. తహసీల్దార్ రామయ్య, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వోలు రవిచంద్ర, సుధాకర్, మెహబూబ, తేజ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో ముగ్గురు సీనియర్ ఓటర్లను సన్మానించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రవికుమార్, మున్సిపాలిటీ కమిషనర్ నరేంద్రకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో మురళికృష్ణ, ఎన్నికల డీటీ పవన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, గోకులకృష్ణ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తడ: తడకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో సీనియర్ ఓటరు జార్జి, జూనియర్ ఓటర్ అయిన ఎస్.ప్రియాంకలను సత్కరించారు. తహసీల్దారు జయజయరావు, సర్పంచ్ జయప్రద తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బందితో కలసి తహసీల్దారు నరసింహరావు ర్యాలీగా అశోక్‌పిల్లర్ కూడలి వద్దకొచ్చి మానవహారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రామాంజనేయులు పాల్గొన్నారు.